ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
సోమవారం 5 ఫిబ్రవరి 2024



నేటి నుంచి ఇంటర్ ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్‌లో ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు సోమవారం నుంచి ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నామని ప్రాంతీయ పర్యవేక్షకులు పి.మురళీధర్ తెలిపారు. తొలి విడతలో సోమవారం నుంచి ఈనెల ఏడోతేదీ వరకు ప్రతిరోజు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటలు, రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరగనున్న పరీక్షలకు తొమ్మిది కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వీటిలో ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలతో పాటు ఎనిమిది ప్రైవేటు కళాశాలలున్నాయన్నారు. ప్రథమ ఏడాది 595, ద్వితీయ ఏడాది 517 మంది విద్యార్థులు ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరవుతారన్నారు.

చెన్నైలో నిందితుడు!

గుర్తించిన పోలీసులు

- పట్టుకునేందుకు వెళ్లిన ప్రత్యేక బృందం
- విమానాశ్రయంలో ఉండగా గుర్తించకపోవడంపై సీపీ పోస్టుమార్టం
- సంబంధిత అధికారులపై ఆగ్రహం
- వైఫల్యంపై జాయింట్ సీపీ ఆధ్వర్యంలో విచారణ
- తహసీల్దార్ రమణయ్య హత్యపై కొనసాగుతున్న దర్యాప్తు



తహసీల్దార్ రమణయ్యపై దాడి చేసిన వ్యక్తి

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ సనపల రమణయ్య హత్య కేసులో నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. రమణయ్యను ఇనుపరాడ్డుతో కొట్టి హత్య చేసింది పెద రుషికొండ జ్యువెల్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న మురహరి సుబ్రహ్మణ్యం గంగారాం అలియాస్ గంగాధర్ అలియాస్ జగన్‌గా గుర్తించినట్టు తెలిసింది. దీంతో గంగాధర్ సెల్‌ఫోన్ టవర్ లోకేషన్ ఆధారంగా ప్రస్తుతం చెన్నైలో ఉన్నట్టు గుర్తించి అక్కడికి ద్వారకా సీఐ రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని పంపించారు. హత్య చేసిన తర్వాత గంగాధర్ తన ద్విచక్రవాహనంపై నేరుగా అనకాపల్లి వైపు వెళ్లి, శనివారం ఉదయాన్నే ఎయిర్‌పోర్టుకు చేరుకున్నట్టు తేల్చారు. గంగాధర్ తన సెల్‌ఫోన్‌లోనే మేక్ మైట్రిప్ యాప్‌లో చెన్నైకి విమానం టిక్కెట్‌తోపాటు రైలు టిక్కెట్టు కూడా తీసినట్టు పోలీసులు ఆధారాలు సేకరించారు. గంగాధర్ సెల్‌ఫోన్ టవర్ లోకేషన్ శనివారం ఉదయానికి ఎయిర్‌పోర్టులో ఉన్నట్టు చూపించి, తర్వాత లోకేషన్ చూపించకపోవడంతో చెన్నై వెళ్లిపోయినట్టు భావించారు. అక్కడికి హుటాహుటిన ఒక బృందాన్ని పంపించారు. కానీ గంగాధర్ ఎయిర్‌పోర్టులోనే ఉండి, శనివారం మధ్యాహ్నం బెంగళూరు మీదుగా చెన్నై వెళ్లే విమానం ఎక్కినప్పటికీ పోలీసులు గుర్తించకపోవడం ఆశ్చర్యానికి గురిచేసింది. చెన్నై విమానం ఎక్కిన గంగాధర్ అక్కడకు వెళ్లకుండా ట్రాన్సిట్ హాల్ట్ కోసం బెంగళూరులో విమానం ఆగడంతో అక్కడ దిగిపోయాడు. అనంతరం శనివారం మధ్యాహ్నం చెన్నై విమానం ఎక్కినట్టు ఆలస్యంగా గుర్తించిన పోలీసులు బెంగళూరు నుంచి చైన్నై వచ్చే విమానంలో గంగాధర్‌ను అదుపులోకి తీసుకోవాలని అప్పటికే చెన్నైలో ఉన్న పోలీస్ బృందాన్ని ఆదేశించారు.

నగర పోలీసులు ఇచ్చిన ఆదేశాలతో విశాఖ నుంచి బెంగళూరు మీదుగా చెన్నై వచ్చిన విమానంలో గంగాధర్ కోసం ప్రత్యేక బృందం గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో కంగుతిన్నారు. తర్వాత గంగాధర్ బెంగళూరులోనే ఉన్నట్టు గుర్తించి ట్రాకింగ్ పెట్టగా, ఆదివారం ఉదయానికి చైన్నైలో ఉన్నట్టు తేలింది. దీంతో మరో బృందాన్ని అక్కడికి ... మిగతా 6వ పేజీలో

ఎవరీ మురహరి గంగాధర్?

తహసీల్దార్ రమణయ్య హత్యకేసులో నిందితుడిగా అనుమానిస్తున్న మురహరి సుబ్రహ్మణ్యం గంగారాం అలియాస్ గంగాధర్ ఎవరనే దానిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. విజయవాడకు చెందిన ఇతడు విజయవాడతో పాటు హైదరాబాద్‌లో కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవాడని, 2019 తర్వాత విశాఖ వచ్చినట్టు కొందరు చెబుతున్నారు. ఎండాడలోని పనోరమాహిల్స్‌లో ఉండేవాడని, తర్వాత పెద్దరుషికొండలోని జ్యువెల్ అపార్ట్‌మెంట్ నిర్మాణ కంపెనీతో సంబంధం ఏర్పడినట్టు సమాచారం. ఈ నిర్మాణానికి జీవీఎంసీ నుంచి ప్లాన్ తెచ్చేపనులు చూశాడని తెలిసింది. అదే అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ కొనుగోలుచేసి నివాసం మార్చుకున్నాడని, తర్వాత ఫ్లాట్‌ల రిజిస్ట్రేషన్‌తో పాటు బ్యాంక్‌రుణాల జారీకి వీలుగా భూమికి సంబంధించిన కన్వెయెన్స్ డీడ్ అవసరం కావడంతో ఆ పనిని చేయిస్తానని కొంత మొత్తానికి ఒప్పందం చేసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. కన్వెయెన్స్ డీడ్ కోసం రూరల్ తహసీల్దార్ రమణయ్యను సంప్రదించారని తెలిసింది. రమణయ్యకు బదిలీ కావడంతో పని జరగదనే భావనతోనే హత్యకు గంగాధర్ ప్రణాళిక వేశాడని పోలీసులు భావిస్తున్నట్టు సమాచారం. కాగా గంగాధర్‌పై సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో చీటింగ్ కేసు ఉన్నట్టు తెలిసింది. అయితే హత్యకేసు దర్యాప్తులో పురోగతిపై పోలీసులు నోరు విప్పకపోవడం అనేక అనుమానాలకు దారితీస్తోంది.

కన్వేయన్స్ డీడ్ జారీలోనే వివాదం

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):

మధురవాడ రెవెన్యూ పరిధిలోని పెద రుషికొండలో నిర్మించిన ఒక అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్లకు సంబంధించి కన్వేయన్స్ డీడ్‌ల జారీ అంశమే తహసీల్దారు రమణయ్య హత్యకు కారణమనే వాదన బలంగా వినిపిస్తోంది. ఈ దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం. చివరకు రెవెన్యూ అధికారులు సైతం ఇదే కారణమని నిర్ధారణకు వచ్చారు. వివరాల్లోనికి వెళితే..

మధురవాడ రెవెన్యూ సర్వేనంబరు 381లో ఐదు ఎకరాల భూమిని ప్రభుత్వం గతంలో కొంతమందికి కేటాయించారు. పట్టా తీసుకున్న యజమానులు ఈ భూమిని ఇతరులకు విక్రయించారు. దీనికి జిల్లా యంత్రాంగం నిరభ్యంతరపత్రాన్ని కూడా జారీచేసింది. తరువాత ఆ భూమిలోని కొంత భాగంలో భారీ అపార్టుమెంట్ నిర్మాణానికి జీవీఎంసీకి దరఖాస్తు చేసుకోగా ప్లాన్ జారీచేసింది. 13 బ్లాకులు, ఎనిమిది అంతస్తుల్లో వందకుపైగా ఫ్లాట్‌లు నిర్మించారు. అయితే ఇందులో కొంత ప్రభుత్వభూమి ఉందని కొందరు జిల్లా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుచేశారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఆ సర్వే నంబరును 22(ఎ) జాబితాలో చేర్చింది. దీనివల్ల ఫ్లాట్‌లు కొనుగోలు చేసిన వారు కోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు క్రమబద్ధీకరణ చేసుకోవాలని కోర్టు ఆదేశించింది. ఇళ్ల క్రమబద్ధీకరణకు 2017 జూలై 24న ప్రభుత్వం 388 జీవో ఇచ్చింది. ఫ్లాట్ యజమానులు సొమ్ము చెల్లించడంతో పట్టాలు జారీచేశారు. రెండేళ్ల తరువాత కన్వేయన్స్ డీడ్‌లు జారీచేస్తామని అప్పట్లో ప్రభుత్వం పేర్కొంది. ఈలోగా ఎన్నికలు జరగడం, ప్రభుత్వం మారడంతో కన్వేయన్స్ డీడ్‌లు జారీ ప్రక్రియ నిలిచిపోయింది. గత ఏడాది వైసీపీ నాయకుల ఒత్తిడితో కన్వేయన్స్ డీడ్‌లు జారీ ప్రక్రియ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో సర్వేనంబరు 381లో నిర్మించిన అపార్టుమెంట్‌లో మొత్తం ఫ్లాట్ల యజమానుల్లో 93 మందికి కన్వేయన్స్ డీడ్‌లు ఇచ్చేశారు. మిగిలిన వారిలో ఐదుగురు విదేశాల్లో ఉండగా మరో ముగ్గురు చనిపోయారు. ఈ ఎనిమిది ఫ్లాట్లకు సంబంధించి మురహరి సుబ్రహ్మణ్యం గంగారాం అలియాస్ గంగాధర్ పేరిట కన్వేయన్స్ డీడ్‌లు జారీచేయాలని కోరుతూ వారి వారసులు రూరల్ తహసీల్దారును కోరారు. దీనికోసం గంగాధర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నట్టు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఆ పని పెండింగ్‌లోనే ఉండగా... నాలుగు రోజులు క్రితం తహసీల్దారు రమణయ్య బదిలీ జరిగింది. ఈ క్రమంలోనే శుక్రవారం రాత్రి రమణయ్య ఇంటి వద్ద వాగ్వాదానికి దిగాడని, చివరకు దాడిచేసి హత్య చేశాడని ప్రచారం జరుగుతోంది.

గిల్ సూపర్ సెంచరీ

రెండో ఇన్నింగ్స్‌లో భారత్‌ను ఆదుకున్న శుభమన్

- మరోసారి నిరాశ పరిచిన రోహిత్ శర్మ
- టామ్ హార్ట్‌లీ చేతికి చిక్కిన భారత్ బ్యాటర్లు
- ఇంగ్లండ్ విజయలక్ష్యం 399
- ఆట ముగిసే సమయానికి 67/1
- మూడోరోజూ భారీగా హాజరైన ప్రేక్షకులు



విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 4:

ఇంగ్లండ్‌తో స్థానిక పీఎం పాలెం స్టేడియంలో జరుగుతున్న టెస్ట్ మ్యాచ్ రసకందాయంలో పడింది. రెండో ఇన్నింగ్స్‌లో టీమిండియాను శుభమన్ గిల్ సెంచరీతో (104) ఆదుకున్నాడు. మిడిల్ ఆర్డర్‌లో అక్షర పటేల్ (45), శ్రేయాస్ అయ్యర్ (29), లోయర్ ఆర్డర్‌లో రవిచంద్రన్ అశ్విన్ (29) రాణించడంతో రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 255 పరుగులు చేసి ఇంగ్లండ్ ముందు 399 పరుగుల విజయలక్ష్యాన్ని ఉంచింది. ఆటకు మరో రెండు రోజులు మిగిలిటన్న నేపథ్యంలో నాల్గో రోజు ఆట రసవత్తరంగా సాగే అవకాశాలున్నాయి.

భారత ఓపెనర్లను ఇంగ్లండ్ వెటరన్ బౌలర్ అండర్సన్ ఒకరి తర్వాత ఒకరుగా పెవిలియన్‌కు పంపడంతో స్టేడియంలో ఒక్కసారిగా నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. తొలి ఇన్నింగ్స్‌లో 14 పరుగులకే అవుటైన కెప్టెన్ రోహిత్ శర్మ.. రెండో ఇన్నింగ్స్‌లోనూ విఫలమై కేవలం 13 పరుగులకే పెవిలియన్ చేరాడు. అండర్సన్ వేసిన బంతిని డిఫెన్స్ ఆడడానికి ప్రయత్నించి క్లీన్ బౌల్డ్ అయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీతో అదరగొట్టిన మరో ఓపెనర్ యశస్వి జైస్వాల్ (17) రెండో ఇన్నింగ్స్‌లో ఎక్కువ సేపు క్రీజులో నిలబడలేకపోయాడు. అవుట్‌సైడ్ ఆఫ్ స్టంప్ మీదుగా అండర్సన్ వేసిన బంతిని డ్రైవ్ చేసేందుకు ప్రయత్నించి ఫస్ట్ స్లిప్‌లోని రూట్‌కు క్యాచిచ్చి రెండో వికెట్‌గా ... మిగతా 6వ పేజీలో

సెంచరీ అనంతరం గిల్ అభివాదం



స్టేడియంలో అభిమానుల సందడి

అభ్యర్థులు 50 వేలు ▸ ఖాళీలు 8?



- ఉమ్మడి జిల్లాలో ఎస్జీటీ ఖాళీలివే!
- జిల్లా విద్యాశాఖకు అందిన సమాచారం
- రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీల సంఖ్య 1,728
- అత్యధికంగా కర్నూలు జిల్లాలోనే 1,646 పోస్టులు
- మిగిలిన అన్ని జిల్లాలకు కలిపి కేవలం 82
- అధికారుల తీరుపై ఆశావహుల ఆగ్రహం

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):

ఎన్నికల ముందు నిరుద్యోగులను ఆకట్టుకునేందుకు ప్రభుత్వం హడావిడిగా విడుదల చేయనున్న డీఎస్సీ నోటిఫికేషన్ ఆశావహులను ఉసూరుమనిపించేలా కనిపిస్తోంది. ఏడేళ్లగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి కళ్లు కాయలుకాసేలా ఎదురుచూస్తున్న వారికి తాజా నోటిఫికేషన్ అశనిపాతంలా పరిణమించనుందనే వాదన వినిపిస్తోంది. కొద్దిరోజుల కిందట నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా 6,100 ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రక్రియలో ఎస్జీటీ (సెకండరీ గ్రేడ్ టీచర్స్) పోస్టుల సంఖ్య తక్కువగా ఉండడంతో అభ్యర్థులు తీవ్ర నిరాశలో కూరుకుపోయారు

సాధారణంగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తే.. ఎస్జీటీలు మూడొంతులు, ఒక వంతు స్కూల్ అసిస్టెంట్ పోస్టులుంటాయి. కానీ ప్రస్తుతం విడుదల చేయనున్న డీఎస్సీలో రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 1,728 మంది ఎస్జీటీ పోస్టులను భర్తీ చేయనున్నారని సమాచారం. వీటిలో ఒక్క కర్నూలు జిల్లాలోనే 1,646 ఖాళీలున్నట్టు చెబుతున్నారు. మిగిలిన జిల్లాల్లో నాలుగు, పది చొప్పున పోస్టులు ఉండగా, ఆరు జిల్లాల్లో ఒక్క ఎస్జీటీ పోస్టు కూడా లేదు. కాగా ఉమ్మడి విశాఖ జిల్లాలో కేవలం ఎనిమిది ఎస్జీటీ పోస్టులను మాత్రమే భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులకు వివరాలు అందా యని తెలిసింది.

50 వేల మంది నిరీక్షణ

ఉమ్మడి జిల్లాలో సుమారు 50 వేల మంది అభ్యర్థులు ఎస్జీటీ పోస్టుల కోసం నిరీక్షిస్తున్నారు. చివరిసారిగా 2018 అక్టోబరులో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీలో రాష్ట్ర వ్యాప్తంగా 7,900 పోస్టులను భర్తీ చేసింది. వీటిలో ఎస్జీటీ పోస్టులే మూడు వేలు. వైసీపీ అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు దాటినా ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. ఎన్నికల ముందు ఆదరాబాదరాగా విడుదల చేయనున్న నోటిఫికేషన్‌లోనూ కనీస ఎస్జీటీ పోస్టులు లేకపోవడంపై అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏటా డీఎడ్ పూర్తిచేసి వస్తున్న వారి సంఖ్య భారీగా పెరుగుతోంది. తాజా నోటిఫికేషన్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కేవలం ఎనిమిది పోస్టులే ఉండడంతో ఏంచేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ప్రతి జిల్లాలో కనీసం 300 పోస్టులను భర్తీచేసేలా నోటిఫికేషన్ ఇవ్వాలని కోరుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఒక్క కర్నూలు జిల్లాలోనే వేలాది ఖాళీలు ఎలా ఏర్పడ్డాయని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఓపీఎస్ కోసం నినదించిన ఉద్యోగులు

- జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏపీసీపీఎస్ఈఏ ఆధ్వర్యంలో సాగర సంగ్రామ దీక్ష

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్ఈఏ) ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆదివారం సాగర సంగ్రామ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ సతీష్ మాట్లాడుతూ ఎనిమిదేళ్లగా సీపీఎస్ రద్దుకోసం పోరాటాలు చేస్తున్నామన్నారు. ఉద్యోగుల ఆశలను వమ్ము చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పీఆర్‌టీయూ నేత గోపినాథ్ మాట్లాడుతూ ఎన్నికలకు తక్కువ సమయం ఉందని, చివరి అవకాశంగా ఓపీఎస్ అమలుచేయాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ ఆర్థిక కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ మాట తప్పిన ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారన్నారు. అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 13.2 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులున్నారన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో సభ్యుడిగా వ్యవహరించిన నాత ప్రసాద్ మాట్లాడుతూ వాస్తవాలను వక్రీకరించేలా ప్రభుత్వం తప్పుడు ప్రచారాన్ని చేయించిందన్నారు. జిల్లా అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ మాట్లాడుతూ మేనిఫెస్టోలోని సీపీఎస్ రద్దు హామీని ఎందుకు అమలుచేయలేదని సీఎంను ప్రశ్నించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కన్వీనర్ రమాదేవి, ఉద్యోగులు పాల్గొన్నారు. దీక్ష ప్రాంగణంలో సీపీఎస్ అంతిమయాత్ర నిర్వహించారు. పాత పెన్షన్ పేరుతో ఏర్పాటు చేసిన సమాధి వద్ద నేతలు నివాళులర్పిస్తూ నిరసన తెలిపారు. పలువురు మహిళా ఉద్యోగులు చెవిలో క్యాబేజీలు పెట్టుకుని నిరసన తెలిపారు.



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

పెండింగ్ ఫైళ్లపై అధికారుల దృష్టి

- రూరల్ తహసీల్దారు కార్యాలయంపై అధికారుల ఫోకస్
- సిబ్బందితో సమావేశమైన భీమిలి ఆర్డీవో

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): విశాఖ రూరల్ తహసీల్దారు కార్యాలయంలో పాలనా వ్యవహారాలపై జిల్లా యంత్రాంగం దృష్టిసారించింది. మండలంలో రెవెన్యూ యంత్రాంగం పరిష్కరించాల్సిన ఫైళ్లు, దరఖాస్తుల ప్రస్తుత పరిస్థితి ఇప్పటికే ఆరా తీశారు. ఈ మేరకు భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి ఆదివారం కార్యాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. రూరల్ తహసీల్దారుగా పనిచేసి మూడురోజుల క్రితం విజయనగరం జిల్లా బొండపల్లికి బదిలీపై వెళ్లిన సనపల రమణయ్య హత్యతో యంత్రాంగం అప్రమత్తమయింది. మండలంలో వివాదంలో ఉన్న భూములు, పరిష్కరించాల్సినవి, న్యాయపరమైన ఇబ్బందులు లేనివి, నిబంధనలకు లోబడి పరిష్కరించాల్సిన ఫైళ్లు తదితర అంశాలపై సిబ్బంది నుంచి ఆర్డీవో వివరాలు సేకరించారని సమాచారం. ప్రదానంగా 296, 388 జీవో మేరకు ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణకు సంబంధించిన లబ్ధిదారులకు కన్వేయన్స్ డీడ్స్ జారీపై ఆరా తీసినట్టు తెలిసింది. కాగా తహసీల్దారు కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది తీవ్ర ఆందోళనలో ఉన్నారు. బయటకు చెప్పడానికి, మాట్లాడేందుకు భయపడుతున్నారు. రెండురోజులుగా పలువురు సిబ్బంది కార్యాలయానికి రావడానికి వెనుకంజ వేస్తున్నారు. సాధారణంగా సెలవు దినాల్లో కూడా జనాలతో రద్దీగా ఉండే కార్యాలయం ఆదివారం మధ్యాహ్నం ఆర్డీవో సమావేశం తరువాత నిర్మానుష్యంగా కనిపించింది.



రూరల్ తహసీల్దారు కార్యాలయం

రా.. కదలి రా!



గొండుపాలెంలో 'రా.. కదలిరా' బహిరంగ సభా వేదిక



నేడు అనకాపల్లి జిల్లా గొండుపాలెంలో టీడీపీ బహిరంగ సభ

- హాజరుకానున్న పార్టీ అధినేత చంద్రబాబునాయుడు
- భారీగా జనసమీకరణకు ఏర్పాట్లు

అనకాపల్లి/కె.కోటపాడు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):

'రా.. కదలి రా!' నినాదంతో సోమవారం అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గం కె.కోటపాడు మండలం గొండుపాలెంలో తెలుగుదేశం పార్టీ నిర్వహించనున్న బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ప్రజలు, టీడీపీ, జనసేన శ్రేణులను తరలించనున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఉదయం 11.30 గంటలకు సభా స్థలికి చేరుకుని సుమారు రెండు గంటలపాటు ప్రసంగించనున్నారు. రా.. కదలి రా! సభ కోసం సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాట్లు చేశారు. ప్రధాన వేదికతోపాటు వీఐపీలు, మీడియా ప్రతినిధులు, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు, మద్దతుదారులు. ఇలా వివిధ వర్గాల వారి కోసం ప్రాధాన్యతాక్రమంలో గ్యాలరీలు సిద్ధమయ్యాయి. సభా వేదికకు సమీపంలో హెలీప్యాడ్, వాహనాల పార్కింగ్‌కు స్థలాలను కేటాయించారు. చోడవరం, కె.కోటపాడు, విశాఖపట్నం నుంచి గొండుపాలెం వచ్చే దారులన్నీ స్వాగతఫ్లెక్సీలతో నిండిపోయాయి.

చంద్రబాబు పర్యటన షెడ్యూల్...

- ఉదయం 10 గంటలకు చంద్రబాబునాయుడు ఉండవల్లిలోని నివాసం నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరతారు.
- 11.20 గంటలకు కె.కోటపాడు మండలం గొండుపాలెం హెలీప్యాడ్‌కు చేరుకుంటారు.
- 11.30 గంటలకు రోడ్డు మార్గంలో సభా వేదిక వద్దకు వస్తారు
- 1.35 గంటల వరకు ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు
- 1.40 గంటలకు సభావేదిక నుంచి హెలీప్యాడ్‌కు చేరుకుంటారు
- 1.45 గంటలకు హెలీకాప్టర్‌లో బయలుదేరి ఏలూరు జిల్లా చింతలపూడి మండలం కనిపూడిలో జరిగే 'రా.. కదలిరా' సభకు వెళతారు.

89 సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జిలు కొనసాగింపు

- ఎనిమిది సొసైటీలకు కొత్త కమిటీలు
- ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలోని 89 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు అధికార వైసీపీకి చెందిన స్థానిక నేతలతో కూడిన పర్సన్ ఇన్‌చార్జి కమిటీల కాలపరిమితిని మరో ఆరు నెలలు పొడిగించారు. ఎనిమిది సొసైటీలకు కొత్త కమిటీలను నియమిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రతి సొసైటీకి ముగ్గురు సభ్యులతో కూడిన పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను ప్రభుత్వం నామినేట్ చేస్తూ వస్తోంది. ఈ కమిటీల గడువు గత నెల 29తో ముగిసింది. వీటి కాలపరిమితి పొడిగించాల్సి ఉన్నా ఆలస్యం కావడంతో ఈనెల రెండో తేదీన నిర్వహించాల్సిన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మహాజనసభ చివరి నిమిషంలో రద్దు చేశారు. కాగా పర్సన్ ఇన్‌చార్జి కమిటీల కాలపరిమితిని మరో ఆరు నెలలు (ఈ ఏడాది జూలై 30 వరకు) పెంచుతూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు ఇచ్చింది.

ఉమ్మడి జిల్లాలో 98 సొసైటీలుండగా రాంబిల్లి మండలం దిమిలి సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి కమిటీకి ఇంకా గడువుంది. మిగిలిన 97లో 89 సొసైటీలకు గతనెల 29 వరకు ఉన్న కమిటీలనే కొనసాగిస్తూ ఉత్తర్వులు విడుదలవగా, మిగిలిన ఎనిమిది సొసైటీలకు కొత్తగా ముగ్గురు సభ్యులతో కూడిన పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను నియమించింది. ఎనిమిది సొసైటీల్లో ఐదు అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉండగా మిగిలిన మూడు అనకాపల్లి జిల్లాలోని అనకాపల్లి గౌరీ సొసైటీ, రావికమతం మండలం మేడివాడ సొసైటీలకు కొత్తవారిని నియమించారు. తుమ్మపాల సొసైటీకి గతంలో ఉన్న కమిటీని రద్దుచేసి సహకారశాఖ అధికారులతో కొత్త కమిటీని నియమించారు. అనకాపల్లి పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి ఛైర్‌పర్సన్ ఇన్‌చార్జిగా విల్లూరి సూర్యనారాయణ, పర్సన్‌లుగా పెంటకోట నూక సన్యాసినాయుడు, ఆళ్ల గణేష్, మేడివాడ సొసైటీ ఛైర్‌పర్సన్ ఇన్‌చార్జిగా కుంచంగి కోటేశ్వరరావు, పర్సన్‌లుగా కోసూరు అప్పారావు, ఇల్లపు శ్రీనును నియమించారు. మేడివాడ సొసైటీ ఛైర్‌పర్సన్ ఇన్‌చార్జిగా కోటేశ్వరరావు, పర్సన్‌గా కోసూరు అప్పారావు పాత కమిటీలో ఉండగా గతంలో ఉండే మరో పర్సన్‌ను తప్పించి ఆ స్థానంలో ఇల్లపు శ్రీనును నియమించారు. తమ్మపాల సొసైటీ ఛైర్‌పర్సన్ ఇన్‌చార్జిగా సహకార శాఖ అనకాపల్లి అసిస్టెంట్ రిజిస్ట్రార్ వీవీవీ సత్యకుమార్‌ను నియమించారు.

కళలకు నిలయం విశాఖ


బృందగానం చేస్తున్న గాయనీగాయకులు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 4: కళలకు విశాఖనగరం నిలయంగా నిలుస్తోందని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మెలోడీ క్రియేటర్స్ ఆధ్వర్యంలో 'చందురిని మించు అంద మొలికించు' పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించారు. కళా రంగ ప్రముఖులు కొణతాల రాజు, సత్యనారాయణ, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, బీరాల ఉప హిజ్రై తొలుత ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాయనీ, గాయకులు ఆలపించిన సినీ గీతాలు అలరించాయి. మెలోడీ క్రియేటర్ అధ్యక్షులు సిహెచ్‌వీ సత్యనారాయణ, కన్వీనర్ ప్రభాకర్,ఎం.ఎస్.మాధవ్, సనమూర్తి, ప్రసాద్, మస్తానరెడ్డి పాల్గొన్నారు.

11న కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం

మహరాణిపేట: వన్‌టౌన్‌లోని శ్రీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఈ నెల 11న వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ అధ్యక్షుడు అరిశెట్టి దినకర్, కార్యదర్శి గ్రంధి రామకృష్ణారావు తెలిపారు. ఆదివారం ఆలయంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కోశాధికారి సుగ్గు శివకుమార్, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.





చంద్రబాబుతోనే అభివృద్ధి

» టీడీపీ సౌత్ ఇన్‌చార్జి గండి బాబ్జీ

మహరాణిపేట, ఫిబ్రవరి 4: టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే, రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తుందని సౌత్ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. దక్షిణ నియోజకవర్గానికి చెందిన 50 మంది యువకులు టీడీపీలో చేరారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో బాబ్జీ వీరంద రికీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మజ్జి శ్రీను, కనకరాజు, నరసింగరావుతో సహా పలువురు ఉన్నారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. అలాగే, రానున్న ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రావటానికి కృషి చేయాలని బాబ్జీ కోరారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే, రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తుందన్నారు.


పార్టీలోకి చేరిన యువకులతో సౌత్ ఇన్‌చార్జి గండి బాబ్జీ

యువతకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంస్కృతి, సంప్రదాయాల ఉత్సవం


ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న బ్రహ్మకుమారీలు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 4 : రైల్వేన్యూకాలనీలోని ప్రజాపిత బ్రహ్మకుమారీల ఈశ్వరీయ విశ్వ విద్యాలయ రాయల్ ప్యాలెస్‌లో ఆదివారం 'సమస్కారం మన సంస్కృతి సాంప్రదాయం' పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. రష్యా నుంచి విచ్చేసిన రాజయోగిని బ్రహ్మకుమారీలు సుధ, జరినా, విక్టోరియా, రూవ, శశికళ తదితరులు ఈ ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధ మాట్లాడుతూ రష్యాలో గత 36 ఏళ్లుగా చేపడుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను వివరించారు. వివిధ జిల్లాల నుంచి బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

లౌకిక శక్తులంతా బీజేపీని గద్దె దింపాలి: ఆర్పీఐ


మాట్లాడుతున్న భారత్ రిపబ్లికన్ పార్టీ ప్రధాన కార్యదర్శి మోహన్‌లాల్ పాటిల్

సీతమ్మధార, ఫిబ్రవరి 4: దళిత, లౌకిక బహుజన శక్తులన్నీ కలిసి రానున్న ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని భారత రిపబ్లికన్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్ లాల్ పాటిల్ పిలుపునిచ్చారు. బల్లయ్య కళాశాల వక్కలగల అంబేద్కర్ భవన్ ఆవరణలో పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో అణగారిన కులాలపై కుట్ర జరుగుతుందన్నారు. ఆర్పీఐ జాతీయ ఉపాధ్యక్షులు బొడ్డు కల్యాణరావు, ప్రొఫెసర్ సత్యపాల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దక్షిణ భారత కార్యనిర్వాహక అధ్యక్షులు వైఆంజయ్య, ఏపీ అధ్యక్షులు ఎస్.డేవిడ్‌రాజు, ఏపీ కార్యదర్శి పిట్ట వరప్రసాద్, ఆర్పీఐ సీనియర్ నాయకులు బత్తుల గౌతమ్‌బాబు, ఎం.వెంకటరావు, రాజాన సరస్వతి పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు సేవ


మతిస్థిమితంలేని వారికి క్షవరం చేయిస్తున్న సత్యసాయి సంస్థల ప్రతినిధులు

జ్ఞానాపురం, ఫిబ్రవరి 4: మానసిక దివ్యాంగులకు శ్రీసత్యసాయి సేవా సంస్థల జిల్లా యువజన విభాగం ఆధ్వర్యంలో సపర్యలు చేశారు. జ్ఞానాపురం రైల్వే స్టేషన్ పరిసరాల్లో ఉన్న 60మంది ఇలాంటి వారిని గుర్తించి క్షవరం చేయించి, స్నానాలు చేయించారు. మంచి భోజనం ఏర్పాటు చేసి పాదరక్షలు అందించారు. డి.రాఘవరావు, సర్వశ్రీరాజు, మోహనరావు, రమేష్, ప్రభాకర్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

సీనియర్ టెన్నిస్ టోర్నీ ప్రారంభం


పోటీలు ప్రారంభిస్తున్న సీపీ రవిశంకర్, అతిథులు

విశాఖపట్నం (స్పోర్ట్స్), ఫిబ్రవరి 4: ఆయస్టా నిర్వహిస్తున్న అఖిల భారత సీనియర్ టెన్నిస్ ర్యాంకింగ్ చాంపియన్‌షిప్ టోర్నీ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఆఫీసర్స్ క్లబ్‌లో జరుగుతున్న ఈ టోర్నీకి నగర పోలీసు కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్ ముఖ్య అతిథిగా హాజరై బెలూన్లను గాల్లో ఎగురవేసి ప్రారంభించారు. ఈ టోర్నీలో దేశ వ్యాప్తంగా సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొనడం అభినందనీయమన్నారు. రిటైర్డ్ డీజీపీ పి.సాంబశివరావు, సీనియర్ అడిషనల్ మావూరి వెంకటరమణ, ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి డాక్టర్ కాంతారావు, ఆయస్టా ప్రతినిధులు నరేష్, ప్రేమ్‌చంద్, డీఎస్ఎన్‌రాజు పాల్గొన్నారు.

బనారస్ రైలుకు అదనపు కోచ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 4: ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ-బనారస్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (18311/18312) ఒక థర్డ్ ఏసీ, ఒక ఏసీ స్లీపర్ కోచ్‌లను జత చేస్తున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. విశాఖ-బనారస్ ఎక్స్‌ప్రెస్ కు (18311) ఈనెల 14 నుంచి, తిరుగు ప్రయాణంలో బనారస్-విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు (18312) ఈనెల 15 నుంచి అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

రానున్న ఎన్నికల్లో ప్రాధాన్యం కల్పించాలి

» టీడీపీ నేత శ్రీభరత్‌కు ముస్లిం మైనారిటీలు వినతి


శ్రీభరత్‌కు వినతి పత్రం ఇస్తున్న ముస్లిం నేతలు

మహరాణిపేట, ఫిబ్రవరి 4: గత 30 ఏళ్లుగా రాజకీయ ప్రాతినిధ్యం లేని తమకు ఈసారి ఎన్నికల్లో తగిన న్యాయం చేయాలని టీడీపీ విశాఖ జిల్లా ముస్లిం మైనారిటీ నాయకులు విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎం. శ్రీభరత్‌ను కోరారు. ఆదివారం రాత్రి ముస్లిం నాయకులు భరత్‌ను ఆయన నివాసంలో కలిసి వినతి పత్రాన్ని అందించారు. అనంతరం అబ్దుల్ చిన రహ్మాన్ మాట్లాడుతూ, ఉత్తరాంధ్రలో ముస్లింలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయగల స్థాయిలో ఉన్నా తమకు ఎటువంటి కల్పించడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. రానున్న ఎన్నికల్లో తమ సామాజిక వర్గానికి అసెంబ్లీ టికెట్ ఇచ్చి గెలిపించు కుంటామని తెలిపారు. ఈసందర్భంగా భరత్ తమ కోరికను అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. ఈ సమావేశంలో జఫరుల్లా, షేక్ కాలీషా, షేక్ రహ్మతుల్లా, మహ్మద్‌గౌస్, బాబ్జీ అబ్దుల్ బాషా, యాసిన్ హిమాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

రైల్వే జోన్ ఏర్పాటులో జగన్ ప్రభుత్వం విఫలం

» జనసేన ఉత్తరాంధ్ర సమన్వయకర్త నాగలక్ష్మి

సీతంపేట, ఫిబ్రవరి 4: పోలవరం సాగునీటి ప్రాజెక్ట్ పూర్తి, రైల్వే జోన్ విశాఖకు తీసుకురావడంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని జనసేన ఉత్తరాంధ్ర సమన్వయకర్త నాగలక్ష్మి ఆరోపించారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ వస్తే ఉత్తరాంధ్ర అభివృద్ధి వేగవంతమవుతుందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని, స్వచ్ఛ రవాణా సులువు అవుతుందన్నారు. గత ఎన్నికల్లో సీఎం జగన్మోహన్‌రెడ్డి పార్టీకి చెందిన ఎంపీలను పూర్తిస్థాయిలో గెలిపించినా ఏం చేయలేకపోయారన్నారు. ఎంతసేపూ అప్పులు తేవడం, ప్రభుత్వ ఆస్తులు విక్రయించడం తప్ప ఆయన ఇంకేమీ చేయలేకపోయారని విమర్శించారు. సమావేశంలో ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమన్వయకర్త కిరణ్‌ప్రసాద్, త్రివేణి, రూపదేవి పాల్గొన్నారు.

క్యాన్సర్ ఆస్పత్రి సేవలు ప్రశంసనీయం

సీతమ్మధార, ఫిబ్రవరి 4: సీతమ్మధారలోని లయన్స్ క్యాన్సర్ అండ్ జనరల్ ఆసుపత్రి సేవలు ప్రశంసనీయమని లయన్స్ క్లబ్ పూర్వ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ప్రేంక్ మోర్ తెలిపారు. ఆదివారం ఆయన ఆస్పత్రిని ఆయన సందర్శించారు. వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా ఆసుపత్రిలో మల్టీ స్పెషాల్టీ క్యాంప్‌ను నిర్వహించారు. ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ వి.ఎమ్‌మహేశ్వరరావు, డాక్టర్ ఎగ్గోపాలరావు, క్లబ్ పూర్వ డైరెక్టర్ వి.విజయకుమార్ రాజు, డాక్టర్లు మోహన్ పాత్రో, కళ్యాణ్ ప్రసాద్, ఎం.శ్రీధరాజు, అంబటి భవాని, తదితరులు పాల్గొన్నారు.

400 మందికి ఉచిత వైద్య సేవలు

సీతమ్మధార, ఫిబ్రవరి 4: గ్రేటర్ 24వ వార్డు నక్కవానిపాలెం ఏఎంజీ అస్పత్రి ఎదుట గల అపార్ట్‌మెంట్ ఆవరణలో ఆదివారం పీవీ సహాయ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పీవీఎస్ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ శిబిరాన్ని జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ నరేష్‌కుమార్ ప్రారంభించారు. అంద్రా ఆస్పత్రి, విశాఖ ఆస్పత్రులకు చెందిన వైద్యులు రోగులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. 400మంది వైద్య సేవలు పొందారు. ట్రస్ట్ ప్రతినిధులు వి.సాంబశివరావు, వీవీ రమణమూర్తి, మూర్తి, కేఎస్ఎన్ మూర్తి, జి.సాంబమూర్తి, పి.శ్రీనివాసరావు సహకరించారు.

ప్రభుత్వ మద్యం దుకాణంలో అగ్ని ప్రమాదం

మహరాణిపేట, ఫిబ్రవరి 4: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రభుత్వ మద్యం దుకాణంలో అగ్ని ప్రమాదం జరిగింది. రూ. 32 లక్షల విలువైన మద్యం ధ్వంసమైంది. నగరంలోని సూర్యాబాగ్ ప్రాంతంలోని నిర్వహిస్తున్న ఈ మద్యం దుకాణంలో శనివారం అర్ధరాత్రి దాటిన గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో 10,900 మద్యం సీసాలు ధ్వంసమై, సుమారు రూ. 32 లక్షల ఆస్తికి నష్టవాటిల్లినట్టు నిర్వాహకులు ఫిర్యాదు చేశారు.పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీలో లింగేశ్వరరావుకు స్వర్ణం

విశాఖపట్నం (స్పోర్ట్స్), ఫిబ్రవరి 4: అఖిల భారత మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన బీవీఎస్‌కే లింగేశ్వరరావు స్వర్ణ పతకం సాధించారు. మొహాలీలో ఆదివారం జరిగిన 55 ప్లస్ డబుల్స్ ఫైనల్స్‌లో చెన్నైకు చెందిన డాక్టర్ మారన్ గణపతితో కలిసి అద్భుతంగా రాణించి స్వర్ణ పతకం కైవసం చేసుకున్నారు. ఈ విజయంపై పలువురు సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

భామా కలాపం-2 చిత్ర బృందం సందడి

మహరాణిపేట, ఫిబ్రవరి 4: భామాకలాపం-2 సినిమా కుటుంబ సమేతంగా అలరిస్తుందని సినీ హీరోయిన్ శరణ్య అన్నారు. సీనియర్ హీరోయిన్ ప్రియమణి ప్రధాన పాత్రలో నటించిన భామా కలాపం -2 సినిమా ఈనెల 16న విడుదల కానుంది. ఈ సినిమా యూనిట్ చిత్ర ప్రమోషన్‌లో భాగంగా హోటల్‌లో ఆదివారం సందడి చేసింది. ఈ సందర్భంగా ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరోయిన్ శరణ్య మాట్లాడారు. అభిమన్యు దర్శకత్వంలో బాపినీడు బి. సుధీర్ చల్లా నిర్మించిన ఈ చిత్రానికి ప్రకాశ్ విహారి సంగీతం సమకూర్చినట్టు చెప్పారు.బాలీవుడ్ నటి సీరత్‌కపూర్ తదితరులున్నారు.


మాట్లాడుతున్న హీరోయిన్ శరణ్య

పారిశ్రామిక అభివృద్ధిపై చర్చకు సిద్ధం

మంత్రి గుడివాడ అమర్



విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాల్లో జరిగిన పారిశ్రామిక అభివృద్ధిపై చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. రాష్ట్రం నుంచి పరిశ్రమలు, ఐటీ కంపెనీలు తరలిపోయాయని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయని, దీనిపై వారు చర్చకు రావాలని సవాల్‌చేశారు. టీడీపీ హయాంలో జరిగిన పారిశ్రామిక అభివృద్ధి, వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధి చాలాతేడా ఉందన్నారు. చంద్రబాబు హయాంలో రూ.30 వేల కోట్లు నుంచి రూ.40 వేల కోట్ల విలువైన పారిశ్రామిక ఒప్పందాలు జరిగితే, తమప్రభుత్వ హయాంలో రూ.90 వేల కోట్లకుపైగా పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయన్నారు.

ఫిషింగ్ హార్బర్‌లో శాంతి హోమం

మహరాణిపేట, ఫిబ్రవరి 4: ఫిషింగ్ హార్బర్‌లో ఆదివారం జలాధ్య రాజ శ్యామల గంగాళమ్మ మహా యజ్ఞం నిర్వహించారు. ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ల ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకీ రామ్ ఆధ్వర్యంలో ముందుగా గంగమ్మతల్లికి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నవంబరులో ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదం మత్స్యకారులపై తీవ్రప్రభావం చూపిందన్నారు. ఈ సీజన్‌లో హార్బర్‌ను, విశాఖ నగరాన్ని కాపాడాలని మూడురోజుల పాటు శాంతి హోమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చొడ పోలయ్య, గుంటు దానయ్య, షైలపల్లి లక్ష్మణరావు, మసేను, రామ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు మేనిఫెస్టోల్లో చేర్చాలి: ఎస్టీయూ

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 4: ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలపై హామీలను రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని ఎస్టీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్టీయూ విశాఖ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని డాబాగార్డెన్స్‌లో నిర్వహించారు. ముందుగా ఎస్టీయూ వ్యవస్థాపకుడు మద్దుల మోహమ్మద్ 117వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం విశాఖ జిల్లా సంఘ అధ్యక్షునిగా పి.దేముడుబాబు, ప్రధాన కార్యదర్శిగా ఇమంది పైడిరాజు, ఆర్థిక కార్యదర్శిగా పి.గోపాలకృష్ణ ఎన్నికయ్యారు. అనకాపల్లి అధ్యక్ష, కార్యదర్శులుగా ఒంటర రవి, పరదేశి , ఆర్థిక కార్యదర్శిగా గంగాధర్ ఎన్నికయ్యారు. అల్లూరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా గిడ్డి వరలక్ష్మి, శేషగిరిరావు , రాష్ట్ర సభ్యులుగా అరిజాగుమ్‌బాబు, చంద్రపద్మావతి, మహిళా కార్యదర్శిగా సునీత ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకుడిగా శ్రావణ్‌బాబు వ్యవహరించారు.

ఇనుప ఖనిజం రవాణాలో రికార్డు

విశాఖపట్నం, ఫిబ్రవరి 4: ఇనుప ఖనిజం రవాణాలో వాల్తేరు డివిజన్ రికార్డు నెలకొల్పింది. ఈ జనవరి నెలాఖరు నాటికి 18.34 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజం లోడింగ్ చేసింది. గత ఏడాది ఈ పోల్చితే 25.36 శాతం పురోగతి సాధించిందని సీనియర్ డీసీఎం ఏకేత్రిపాఠి తెలిపారు. ఈ సందర్భంగా డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఎన్ఎండీసీ, ఆర్ఐఎన్ఎల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, కేఐవోసీఎల్ లిమిటెడ్ సంస్థల సమన్వయంతో రికార్డు సాధించామని పేర్కొన్నారు.

ఆర్థిక సమస్యలతో అధ్యాపకుడు ఆత్మహత్య


రవికుమార్ మృతదేహం

సీతంపేట, ఫిబ్రవరి 4: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది ఓ ప్రైవేట్ కళాశాల అధ్యాపకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. నాలుగో పట్టణ స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాలిలా...చోడవరం వెంకన్నపాలెం గ్రామానికి చెందిన గంట్ల రవికుమార్ (45)... భార్య పావని, కుమారుడితో కలిసి నివాసం ఉంటున్నారు. రవికుమార్ నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. భార్య కూడా ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. అయితే, కొద్దిరోజులుగా ఆర్థిక సమస్యల నేపథ్యంలో అతని భార్య పావని ఇంట్లో మాటలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి ఇంటికి తిరిగి వచ్చిన రవికుమార్ మనస్తాపంతో ఇంట్లో ఫ్యాన్‌కి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చిన రవికుమార్ కుమారుడు తండ్రిని చూసి కేకలు వేశారు. దీంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉరి వేసుకుని బాలుడి ఆత్మహత్య

ఆరిలోవ, ఫిబ్రవరి 4 : ఆరిలోవ ప్రాంతానికి చెందిన ఓ బాలుడు (17) బాలిక ప్రేమించలేదన్న మనస్తాపంతో ఆదివారం రం తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలుడు నగరంలోని ఓ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు.తన ఇంటికి సమీపంలోని బాలికను ప్రేమించాడు. దానికి ఆమె అంగీకరించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

'పవన్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవు'

సీతంపేట, ఫిబ్రవరి 4: ఏలూరులో జరిగిన సిద్ధం సభలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తమ అధినేత పవన్ కల్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని జనసేన చోడవరం జనసేన పార్టీ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నా ఆక్రా దత్తపుత్ర అని చేస్తే ముఖ్యమంత్రి సొంత చెల్లెలు వ్యాఖ్యలు చేయడం చేతకాలేదా అని ప్రశ్నించారు. వారు అన్నను ప్రశ్నిస్తున్నప్పుడు సమాధానం చెప్పలేని దౌర్భాగ్య స్థితిలో జగన్ ఉన్నారన్నారు. ఆడపిల్లలను చూడకుండా వైసీపీ సోషల్ మీడియాతో పలు రకాలుగా మాట్లాడిస్తున్నారన్నారు.

చెన్నైలో నిందితుడు!

... 5వ పేజీ తరువాయి

పంపించారు. ఐదిలావుండగా శనివారం ఉదయానికి నిందితుడు గంగాధర్‌గా గుర్తించడంతో పాటు ఎక్కడికి వెళ్లిందుకు టికెట్లు తీశాడు, అతని లొకేషన్ ఎక్కడ అనేది తెలుసుకున్నప్పటికీ శనివారం మధ్యాహ్నం వరకూ నగరంలోనే ఉన్నా గుర్తించలేకపోవడం, పట్టుకోలేకపోవడంపై సీపీ రవిశంకర్ అయ్యన్నార్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఆదివారం పలుమార్లు అధికారులతో సమావేశమై గంగాధర్‌ను అదుపులోకి తీసుకోలేకపోవడానికి కారణాలు, వైఫల్యాలపై చర్చించడంతోపాటు ఇప్పుడు ఏం చేయాలనేదానిపైనా చర్చించినట్టు సమాచారం. ఎయిర్‌పోర్టులో నిందితుడు ఉన్నప్పటికీ గుర్తించలేకపోవడంతో సంబంధిత అధికారులు వివరణ చాలని కారణాలపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని జాయింట్ పోలీస్ కమిషనర్‌ను ఆదేశించారని, అందులో భాగంగానే జాయింట్ సీపీ ఫకీరప్ప ఆదివారం ఎయిర్‌పోర్టుకు వెళ్లి పలు అంశాలను పరిశీలించినట్టు పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

గిల్ సూపర్ సెంచరీ

... 5వ పేజీ తరువాయి

వెనుదిరిగాడు. లోకల్ బాయ్ శ్రీకర్ భరత్ (6) మరోసారి అభిమానులను తీవ్రంగా నిరాశపరిచాడు.

ఆదుకున్న శుభమన్ గిల్

వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన శుభమన్ గిల్ (104) తొలి బంతి నుంచి దూకుడుగా ఆడాడు. రెహన్ అహ్మద్ బౌలింగ్‌లో వరుసగా రెండు బౌండరీలు కొట్టి కేవలం 60 బంతుల్లో ఎనిమిది బౌండరీలు, ఒక సిక్సర్‌తో అర్ధ సెంచరీ సాధించాడు. ఈ దశలో మరో ఎండ్‌లో శ్రేయస్ అయ్యర్ (29), పటీదార్ (9) విఫలమై పెవిలియన్‌కు చేరుకున్నారు. ఇక 41వ ఓవర్‌లో రెహన్ అహ్మద్ బౌలింగ్‌లో మరోసారి విరుచుకుపడి వరుసగా లెగ్ స్లిప్ మీదుగా బౌండరీ, మిడ్ వికెట్ మీదుగా బౌండరీ, స్క్వేర్ లెగ్ మీదుగా మరో బౌండరీ బాది స్కోరు బోర్డును పరిగెత్తించాడు. 52వ ఓవర్‌లో బషీర్ బౌలింగ్‌లో సింగిల్ తీసి సెంచరీ పూర్తిచేశాడు. శుభమన్ గిల్‌కు విశాఖలో ఇది తొలి సెంచరీ కాగా, టెస్టు కెరీర్‌లో రెండోది కావడం విశేషం. సెంచరీ తర్వాత మరో నాలుగు పరుగులు జోడించిన గిల్... 55వ ఓవర్ చివరి బంతికి బషీర్ బౌలింగ్‌లో బెన్ ఫోక్స్‌కు క్యాచ్ ఇచ్చి అవుట్ అయి పెవిలియన్ చేరాడు. మరో ఎండ్‌లో గిల్‌కు సహకరిస్తూ స్కోరు బోర్డును ముందుకు నడిపించిన అక్షర్ పటేల్ (45) హార్ట్‌లీ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. రెండు బౌండరీలు, ఒక సిక్సర్‌తో కొద్దిసేపు మెరుపులు మెరిపించిన అశ్విన్ (26) రెహన్ అహ్మద్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. లోకల్ బాయ్ శ్రీకర్ భరత్ (6), కులదీప్ యాదవ్ (0), బుమ్రా (0) విఫలమవడంతో భారత్ స్కోర్ 255 పరుగులకు పరిమితమయింది.

హార్ట్‌లీ స్పిన్ మాయాజాలం

తొలి టెస్టులో భారత్ బ్యాటర్లను ముప్పతిప్పలు పెట్టిన స్పిన్నర్ హార్ట్‌లీ రెండో టెస్టు సెకండ్ ఇన్నింగ్స్‌లో భారత్ బ్యాటింగ్‌ను చెల్లాచెదురుచేశాడు. మూడో రోజు ఆటలో శ్రేయస్ అయ్యర్, అక్షరపటేల్, కులదీప్ యాదవ్, బుమ్రాలను అవుట్ చేశాడు.

ఇంగ్లండ్ 67/1

రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 14 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 67 పరుగులు చేసింది. బుమ్రా బౌలింగ్‌లో కీపర్ భరత్ అద్భుతమైన క్యాచ్ పట్టి ఓపెనర్ బెన్ డకెట్‌ను (28; 6 ఫోర్లు) అవుట్ చేశాడు. జాక్ క్రాలీ 29 నాటౌట్, రెహన్ అహ్మద్ 9 నాటౌట్‌తో క్రీజులో ఉన్నారు.

పోటెత్తిన ప్రేక్షకులు

మూడోరోజు ఆదివారం కావడంతో మ్యాచ్‌ను వీక్షించేందుకు భారీ సంఖ్యలో ప్రేక్షకులు తరలివచ్చారు. పెవిలియన్ వైపు స్టాండ్స్ నిండిపోయాయి. భారత్ బ్యాటింగ్ జరిగినంతసేపు కేరింతలు, చప్పట్లతో స్టేడియం హోరెత్తింది. సుమారు ఆరు వేల మంది విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించినట్టు ఏసీఏ కార్యదర్శి గోపినాథరెడ్డి తెలిపారు. క్లబ్ క్రికెటర్లను కూడా ఎక్కువ సంఖ్యలో అనుమతించామన్నారు. అన్ని స్టాండ్స్‌లో తాగునీరు, స్నాక్స్ అందుబాటులో ఉంచామన్నారు.

మ్యాచ్ తిలకించిన రోజర్ బిన్నీ

భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) అధ్యక్షుడు రోజర్ బిన్నీ ఆదివారం మ్యాచ్‌ను వీక్షించారు. ఏసీఏ కార్యదర్శి గోపినాథరెడ్డి, ఇతర ప్రతినిధులు అతనికి స్వాగతం పలికారు. ఆట ప్రారంభానికి ముందు స్టేడియంలో బీసీసీఐ జెండాను బిన్నీ ఆవిష్కరించారు. అతనితో పాటు బీసీసీఐ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ దామోదర్‌ప్రసాద్ హాజరయ్యారు. నగర పోలీసు కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్ గ్యాలరీలో కూర్చుని మ్యాచ్‌ను తిలకించారు. మూడో రోజు మ్యాచ్‌లో ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ సందడి చేశారు. సౌత్ ఎండ్ ఈస్ట్ లోయర్‌లో కూర్చుని పాల్ మ్యాచ్ చూస్తుండగా అభిమానులు అతనితో సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు.

డ్రెస్సింగ్ రూమ్‌లోకి ఆగంతకుడు

మూడో రోజు ఆట ముగిసిన తర్వాత గుర్తు తెలియని యువకుడు భారత్ డ్రెస్సింగ్ రూమ్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించాడు. భద్రతా సిబ్బంది అప్రమత్తమై అతడిని పట్టుకుని, కొద్దిసేపు విచారించి వదిలేసినట్టు సమాచారం.

అండగా ఉంటాం.. ఆదరించండి

తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



వడ్లపూడిలో టీడీపీ జెండా ఆవిష్కరించిన పల్లా శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 4: ప్రజలకు అండగా ఉంటామని, రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన పార్టీల అభ్యర్థులను గెలిపించవలసిందిగా తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనువాసరావు కోరారు. 87వ వార్డు పరిధి వడ్లపూడి సీడబ్ల్యూసీ సెంటర్‌లో ఆదివారం నాయకుడు సూరిశెట్టి పెంటారావు ఏర్పాటు చేసిన టీడీపీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ నియంత పాలనకు అంతం పలికే సమయం ఆసన్నమైందన్నారు. వైసీపీ నాలుగున్నరేళ్ల పాలనలో అభివృద్ధి సున్నా అని విమర్శించారు. రాష్ట్రంలో అరాచకాలు ఆగాలన్నా, అభివృద్ధి టీడీపీ-జనసేన అభ్యర్థులను గెలిపించాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ అధికారులను ప్రశాంతంగా విధులు నిర్వహించకుండా చేస్తున్నారని, తమ పనులు చేయించుకునేందుకు అరాచక శక్తులు భయభ్రాంతులకు గురిచేయడం, మాట వినకపోతే తీవ్ర వేధింపులకు గురి చేయడం సమంజసం కాదన్నారు. సీఎం జగన్ పాలనలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైసీపీకి చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. నాయకులు విజయరామరాజు, రాజన్‌రాజు, సత్తిబాబు, రాంబాబు, అప్పారావు, శ్రీనివాస వర్మ, తదితరులు పాల్గొన్నారు.

అందరి సంక్షేమమే టీడీపీ ధ్యేయం

గాజువాక: రాష్ట్ర ప్రజలందరి సంక్షేమమే టీడీపీ ధ్యేయమని పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన జయహో బీసీ సదస్సులో ఆయన మాట్లాడుతూ పలు వార్డుల్లో జయహో బీసీ సదస్సులను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. బీసీలకు అన్నివిధాల తెలుగుదేశం పార్టీ అండగా ఉందని, కానీ వైసీపీ ప్రభుత్వం బీసీలపై దాడులకు తెర లేపిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు



పాదయాత్రలో పాల్గొన్న కోన తాతారావు, మురళీదేవి, తదితరులు

ఆటోనగర్, ఫిబ్రవరి 4: రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు పిలుపునిచ్చారు. 70వ వార్డు పరిధి ఎల్‌వీ నగర్‌లో ఆదివారం జనసేన నాయకులు లంకల మురళీదేవి, కేవీ సూరిబాబు, తుంపాల చిరంజీవిల ఆధ్వర్యంలో భారీ ఎత్తున పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్ర శ్రీనివాసనగర్, టీవీఎస్ కాలనీ, డ్రైవర్స్ కాలనీ, ఎర్రగెడ్డ కాలనీల మీదగా పాదయాత్ర సాగింది. ఈ సందర్భంగా కోన తాతారావు మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఒక్క చాన్స్ అంటూ ముఖ్యమంత్రి అయిన జగన్‌ను ఇంటికి సాగనంపుదామన్నారు. నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజలతో మమేకమవుతూ ప్రభుత్వ వైఫల్యాలను తెలపడమే కాకుండా వైసీపీకి ఓటు వేయడం వల్ల జరిగే నష్టాలను ప్రజలకు వివరించాలని కోన తాతారావు విజ్ఞప్తి చేశారు. ప్రజలకు భరోసా, యువతకు ఉపాధి, రాష్ట్రానికి మంచి భవిష్యత్తు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రాకతోనే సాధ్యమవుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో జనసేన-టీడీపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరణం కనకారావు, శ్రీకాంత్, శ్రావణి, నవీన్, జి.వెంకటరావు, నాగేశ్వరరావు, జి.అప్పారావు, షాలిని, తదితరులు పాల్గొన్నారు.

'బ్రాహ్మణులకు టికెట్ ఇవ్వని పార్టీలను ఓడిస్తాం'



ర్యాలీలో పాల్గొన్న వేద పండితులు, అధ్యాపకులు, అర్చక, పురోహితులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 4: వచ్చే ఎన్నికల్లో బ్రాహ్మణులకు టికెట్ ఇవ్వని పార్టీలను ఓడించాలని బ్రాహ్మణ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం సిరిపురం ద్రోణంరాజు సర్కిల్ నుంచి బ్రాహ్మణ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బ్రాహ్మణుల ఆదికృత కోసం విప్రోత్సవం సభ, ర్యాలీ నిర్వహించారు. ముందుగా ద్రోణంరాజు సర్కిల్ నుంచి పీవీ నరసింహారావు కూడలి వరకు శోభాయాత్రగా వెళ్లి అక్కడ పీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సభ వేదిక గురజాడ కళాక్షేత్రం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విప్రోత్సవ కమిటీ కన్వీనర్ పీవీ నారాయణ, వివిధ బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన బ్రాహ్మణులు జనాభాలో 10 శాతం మంది ఉన్నారన్నారు. తాము ఏ పార్టీకి అనుకూలం కాదని, వ్యతిరేకం కూడా కాదన్నారు. గత కొన్నేళ్లుగా బ్రాహ్మణులకు టికెట్లు ఇవ్వలేదని, ఈసారి టికెట్ ఇవ్వని పార్టీని ఓడిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్, మహిళా ప్రతినిధి సుహాసిని ఆనంద్, కావూరి చరణ్‌కుమార్, సంస్కృత, ఆంధ్ర పండితులు వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్, విశ్రాంత ఐఏఎస్ అధికారిణి వైవీ అనురాధ, కేజీహెచ్ ఉప సూపరింటెండెంట్ డా.రాధాకృష్ణ, ప్రముఖ న్యాయవాది కేవీ రామమూర్తి, ఆకెళ్ల రమణమూర్తి, నండూరి సుబ్రహ్మణ్యం, కె. రామభద్రుడు, తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో వీవీ లక్ష్మీనారాయణ, పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

ఉక్కు కోసం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధం

జై భారత్ పార్టీ అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 4: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమని జై భారత్ పార్టీ అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. కూర్మన్నపాలెంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల శిబిరానికి ఆదివారం ఆయన విచ్చేసి కార్మికులకు సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 7, 8 తేదీల్లో ఢిల్లీలో జరగనున్న నిరసన దీక్షలో తాను పాల్గొంటానన్నారు. ఉక్కు కర్మాగారం కోసం భూములిచ్చిన నిర్వాసితులకు ఇప్పటికీ న్యాయం జరగకపోవడం దారుణమన్నారు. స్టీల్‌ప్లాంట్ మిగులు భూములను తిరిగి నిర్వాసితులకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవలసిన బాధ్యత తెలుగు ప్రజలందరిపై ఉందన్నారు. ఉక్కు కర్మాగారం ప్రభుత్వ రంగ సంస్థగానే ఉండాలన్న లక్ష్యంతో తాను గతంలో బిడ్ వేయడంతో పాటు కోర్టును ఆశ్రయించిన విషయాన్ని గుర్తు చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలన్నారు. ఉక్కు పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఇప్పటికైనా కేంద్రం మొండి వైఖరిని వీడి ఉక్కు ప్రైవేటీకరణ యోచనను విరమించాలని లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉక్కు పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న క్రైమ్ సీఐ కె.శ్రీనివాసరావు

గాజువాక, ఫిబ్రవరి 4: నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సౌత్ సబ్ డివిజన్ క్రైమ్ సీఐ కె.శ్రీనివాసరావు కోరారు. గాజువాక విశ్వేశ్వరయ్యనగర్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, తద్వారా ఏదైనా నేరం జరిగితే నిందితులను పట్టుకోవడం సులభతరమవుతుందన్నారు. ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తూ పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి

మల్కాపురం, ఫిబ్రవరి 4: విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని మల్కాపురం సీఐ సన్యాసినాయుడు అన్నారు. శ్రీహరిపురంలోని ఏవీకే బ్రాంచిలో ఆదివారం సైన్స్ అండ్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సైన్స్ పట్ల ఆకర్షితులవ్వాలన్నారు. ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు ప్రదర్శించిన పలు నమూనాలు అబ్బురపరిచాయి.

బాలల హక్కుల పరిరక్షణపై ప్రాంతీయ సదస్సు రేపు

విశాఖపట్నం, ఫిబ్రవరి 4: నగరంలోని రాయల్ ఫోర్ట్ హోటల్‌లో బాలల హక్కుల పరిరక్షణపై ఆరు జిల్లాల అధికారులతో మంగళవారం ప్రాంతీయ సదస్సు నిర్వహించనున్నట్టు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం తెలిపారు. ఆదివారం వారు ఎంవీపీ కాలనీలో విలేకరులతో మాట్లాడారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో బాలల హక్కుల రక్షణ, ప్రభుత్వాలు రూపొందించిన చట్టాల అమలులో ఎదురవుతున్న సమస్యలు, సవాళ్లు అన్న అంశంపై సదస్సులో చర్చించనున్నట్టు వారు చెప్పారు.



యారాడ సాగరతీరంలో సందర్శకులు

యారాడ బీచ్‌కు సందర్శకుల తాకిడి

సింధియా, ఫిబ్రవరి 4: యారాడ బీచ్‌కు ఆదివారం అధిక సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. సెలవు రోజు కావడంతో ఉదయం నుంచే పర్యాటకుల తాకిడి నెలకొంది. సాయంత్రమయ్యేసరికి ఆ తాకిడి మరింత అధికమైంది. సందర్శకులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు.

'ప్రజా రైతు' ఆధ్వర్యంలో పాదయాత్ర




పాదయాత్రలో పాల్గొన్న భూ బాధితులు

వేపగుంట, ఫిబ్రవరి 4: పంచగ్రామాల భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ముత్యాలమ్మ గుడి నుంచి సింహాచలం తొలి పావంచ వరకు పాదయాత్ర చేపట్టారు. 1903 గిల్‌మెన్ సర్వే ప్రకారం భూ సమస్యను పరిష్కరించాలని, రైతలను హక్కుదారులుగా గుర్తించాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కృష్ణంరాజు, ప్రతాప్, కేఆర్కే ప్రసాద్, బి.శంకరరావు, వి.హనుమంతరావు, పంచగ్రామాల భూ బాధితులు పాల్గొన్నారు.

కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

వేపగుంట, ఫిబ్రవరి 4: జీవీఎంసీ జోన్-8 పరిధిలో ఉన్న కాలనీల అసోసియేషన్ల సమావేశం ఆదివారం ఉదయం ప్రహ్లాదపరం మోడీ స్ట్రీట్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ సంక్షేమ సంఘాల సమాఖ్య (ఏపీఫెర్వాస్) అసోసియేట్ అధ్యక్షుడు డాక్టర్ కేఎస్ఆర్ మూర్తి మాట్లాడుతూ కాలనీ అసోసియేషన్లు సమస్యలను గుర్తించడం, వాటి పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. అలాగే భవిష్యత్తు కార్యచరణపై చర్చించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ పెద్దలు ఉదయ్ శ్రీరామ్, మోడీ స్ట్రీట్ అధ్యక్షుడు సూరపురాజు, ఎం.దుర్గాప్రసాద్, రవీంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం ఉదయం కోటనరవ కాలనీ సమీపంలోని చెరువు వద్ద..

గోపాలపట్నం, ఫిబ్రవరి 4: గోపాలపట్నం శివారు ప్రాంతాలైన నరవ, కోటనరవ ప్రాంతాలు పొగమంచుతో మన్యం వాతావరణాన్ని తలపిస్తోంది. ఉదయం ఎనిమిది గంటలు దాటినా ఆయా ప్రాంతాల్లో దట్టమైన మంచు కమ్మేస్తుండడంతో వాహనదారులు హెడ్ లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో వ్యవసాయ క్షేత్రాలు, చెరువులు, సమీపంలో రిజర్వాయర్ ఉండడంతో దట్టంగా మంచు కురుస్తున్నది.



విద్యాభ్యాసం పూర్తి చేసిన విద్యార్థులతో ధార్మిక పండితులు

ధార్మిక విద్యతో వ్యక్తిత్వ వికాసం

గోపాలపట్నం, ఫిబ్రవరి 4: ధార్మిక విద్యా భ్యాసం వల్ల వ్యక్తిత్వ వికాసం లభిస్తుందని ప్రముఖ ఆధ్యాత్మిక బోధకుడు సిరాజుర్రెహ్మాన్ అన్నారు. నరవ గ్రామంలోని జామియా ఇస్లామియా అష్రఫుల్ ఉలూమ్ మదర్సా కరస్పాండెంట్ మోతీవుర్రెహ్మాన్ ఆధ్వర్యంలో స్నాతకోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిరాజుర్రెహ్మాన్ మాట్లాడుతూ దైవ భీతితోనే చెడు వ్యసనాలకు దూరంగా ఉండడం సాధ్యమని, విద్యార్థి దశ నుంచి అందరూ ప్రతి ఆధ్యాత్మిక గ్రంథాలను పఠించడం ద్వారా ఏకాగ్రత, క్రమశిక్షణ అలవడుతుందన్నారు. అనంతరం మదర్సాలో విద్యాభ్యాసం చేసి పూర్తి చేసిన విద్యార్థులకు జామియా ఇస్లామియ అష్రఫుల్ ఉలూమ్ (అక్కల్‌కువా) సంస్థ డైరెక్టర్ మౌలానా హైజైఫా ఉత్తానవీ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

పెందుర్తి-రూరల్, ఫిబ్రవరి 4: జీవీఎంసీ 95వ వార్డు పరిధి చీమలాపల్లి రామాలయం వెనక ఉన్న రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ ముమ్మన దేముడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు అయిత ఎర్రయ్య, కంచిబోయిన సంతోష్, దువ్వి అప్పారావు, పరదేశినాయుడు, రాజేశ్‌కుమార్, శివ, టైల్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న కేంద్ర ఎన్నికల అధికారి



ఎన్నికల అధికారి సంజయ్‌కుమార్



క్రికెటర్ వాషింగ్‌టన్ సుందర్

సింహాచలం, ఫిబ్రవరి 4 : వరాహలక్ష్మీనృసింహస్వామిని కేంద్ర ఎన్నికల సంఘం అధి కారి సంజయ్‌కుమార్ దంపతులు, భారత క్రికెటర్ వాషింగ్‌టన్ సుందర్ ఆదివారం దర్శించుకున్నారు. వారికి దేవస్థానం కార్యనిర్వహణాధికారికి సింగల శ్రీనివాసమూర్తి అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభం ఆలింగనం తరువాత అంతరాలయంలో ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ప్రముఖుల గోత్రనామాలతో పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫోటోను, ప్రసాదాలను అందజేశారు.

నీతి కథలతో చిన్నారులకు మేలు

పెదగంట్యాడ, ఫిబ్రవరి 4: నీతి కథలు చదవడం వల్ల పిల్లల ఆలోచనలు ప్రభావితమవుతాయని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాధికారి పీవీ రమణ అన్నారు. నీతి కథలతో పాటు సామాజిక స్పృహ, నేటి సమాజం-పరిణామాలు వంటి కథలు పిల్లల ఆలోచనా శక్తిని పెంచుతాయన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఉదయం చదడడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. తెలుగు, ఇంగ్లీష భాషల్లోని కథల పుస్తకాలను గ్రంథాలయాధికారి వారికి ఇచ్చి చదివించారు. చిన్నచిన్న కథలు రాసే ప్రయత్నం చేయాలని విద్యార్థులకు సూచించారు.

సినిమా గైడ్

● **అంబాజీపేట మ్యారేజి బ్యాండు :** మెలోడి, రమాదేవి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), సప్తగిరి (తగరపువలస)
● **బూట్‌కట్ బాలరాజు :** మోహిని (గాజువాక),
● **ధీర :** కిన్నెర, మౌర్య (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
● **కిస్మత్ :** కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), విశేష్ (గాజువాక),
● **కెప్టెన్ మిల్లర్ :** వెంకటేశ్వర
● **నా సామిరంగ :** శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
● **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
● **గుంటూరు కారం :** జగదాంబ, సంగం, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 20, టమాటా 30, వంకాయలు (తెలుపు) 16, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 54, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 46, బీరకాయలు 54, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 16, క్యారెట్ 24, దొండకాయలు 32, బంగాళదుంపలు 20, అరటికాయ (పెద్దది) 4, అల్లం (పాతది) 115, మునక్కాడలు (కిలో) 95, బరబాటి 26, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 36, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 360, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 52 , ఆగాకర 84, పొటల్స్ 62, కీర దోస 32, క్యాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 56, చిలగడదుంపలు 28, కంద 54, దేముడుచిక్కుడు 32, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 20, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	97
ఫారం ధర	--	117
విత్ స్కిన్	--	204
స్కిన్‌లెస్	--	214

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8లో..



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు

విండ్‌బాల్ క్రికెట్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక, ఫిబ్రవరి 4: గంగవరం యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న జిల్లా స్థాయి విండ్‌బాల్ క్రికెట్ పోటీల పోస్టర్‌ను ఆదివారం గాజువాకలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ పోటీలను నిర్వహిస్తామన్నారు. జిల్లాకు చెందిన పన్నెండు జట్లు ఇందులో పాల్గొంటాయని పేర్కొన్నారు. విజయం సాధించిన జట్లకు ట్రోఫీలతో పాటు నగదు బహుమతి అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, మసేను, ధనరాజు, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో బయోమెట్రిక్ హాజరు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 4: స్టీల్‌ప్లాంట్‌లో బయోమెట్రిక్ హాజరు నమోదుకు యాజమాన్యం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే కొన్ని విభాగాల్లో బయోమెట్రిక్ అమలు చేస్తుండగా, ఇప్పుడు అన్ని విభాగాల్లో అమలు చేసేందుకు యాజమాన్యం చర్యలు చేపట్టింది. జనరల్ షిఫ్ట్ వారికి ఎంట్రీ ఉదయం ఎనిమిది నుంచి తొమ్మిది గంటల వరకు, ఎగ్జిట్ సమయం సాయంత్రం ఐదున్నర నుంచి రాత్రి ఏడు గంటల వరకు, ఏ-షిఫ్ట్ వారికి ఎంట్రీ ఉదయం ఐదు నుంచి ఆరు గంటల వరకు, ఎగ్జిట్ సమయం మధ్యాహ్నం రెండున్నర నుంచి మూడున్నర వరకు, బీ-షిఫ్ట్ వారికి ఎంట్రీ సమయం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రెండు వరకు, ఎగ్జిట్ సమయం రాత్రి పదిన్నర నుంచి 11.30 గంటల వరకు ఉంటుంది. అదేవిధంగా సీ-షిఫ్ట్ వారికి ప్రవేశ సమయం సమయం రాత్రి తొమ్మిది నుంచి పది గంటల వరకు, ఎగ్జిట్ సమయం మర్నాడు ఉదయం ఆరున్నర నుంచి ఏడున్నరకు విధించయారు. ఆ సమయాల్లో ఆయా షిఫ్ట్ ఉద్యోగులు బయోమెట్రిక్ హాజరును తప్పనసరిగా వేయాల్సి ఉంటుంది.

బాడీ బిల్డింగ్ పోటీల వాల్ పోస్టర్లు ఆవిష్కరణ



ట్రోఫీ, వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, తదితరులు

మల్కాపురం, ఫిబ్రవరి 4: ఈ నెల 25న ఓల్డ్ ఐటీఐ జంక్షన్ వద్ద జరగనున్న మిస్టర్ ఆంధ్ర ఓపెన్ చాలెంజ్ పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్, ట్రోఫీని వైసీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పారిశ్రామిక ప్రాంతంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాయామం ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుస్తుందన్నారు. పలువురు అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా పైడిమాంబ అమ్మవారి పరస



వేపగుంట, ఫిబ్రవరి 4: జీవీఎంసీ 93వ వార్డు పరిధి ప్రహ్లాదపురంలో పైడిమాంబ అమ్మవారి పరసను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేయగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి మొక్కులు చెల్లించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నేడు రోళ్ల పైడిమాంబ ఆలయ వార్షికోత్సవం

పెందుర్తి-రూరల్, ఫిబ్రవరి 4: జీవీఎంసీ 95వ వార్డు పరిధి చీమలాపల్లి, పరిసర గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత రోళ్ల పైడిమాంబ ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త ఎర్నిబాబు తెలిపారు. ఉదయం అమ్మవారికి ప్రతేక పూజలు, అభిషేకాలు, సాయంత్రం భజన నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపడతామన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సింధియా, ఫిబ్రవరి 4: జీవీఎంసీ 40వ వార్డు పరిధిలోని షిప్‌యార్డు, ఏకేసీ కాలనీల్లో పలు అభివృద్ధి పనులకు వైసీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. వార్డులో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, షిప్‌యార్డు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: గ్రేటర్ 90వ వార్డులో సుమారు రూ.30 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు వైసీపీ పశ్చిమ ఇన్‌చార్జి ఆడారి ఆనంద్‌కుమార్ శంకుస్థాపన చేశారు. లక్ష్మీనగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పక్కనున్న పంచతంత్ర పార్కులో షటిల్ కోర్టు, ఓపెన్ జిమ్, బుచ్చిరాజుపాలెంలో రామాలయం అదనపు ప్రాంగణ నిర్మాణ పనులు చేపడతామన్నారు. నాయకులు నమ్మి శ్రీను, ప్రసాదరెడ్డి, బి.అప్పలరెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులను ఖండించాలి

సింధియా, ఫిబ్రవరి 4: జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో యారాడ అగ్రి గోల్డ్ బీచ్‌లో ఆదివారం భారత రాజ్యాంగ వారోత్సవాలను పురస్కరించుకుని రాజ్యాంగ హక్కుల సదస్సు నిర్వహిచారు. ఈ సందర్భంగా నాయకుడు బూసి వెంకటరావు మాట్లాడుతూ దళితులపై జరుగున్న దాడులను ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా అందరు నడుచుకోవాలని, భారత రాజ్యంగంలో ఉన్న మానవ హక్కుల గురించి అందరికీ తెలియజేయాలన్నారు. అనంతరం జై భీమ్ యూత్ నిర్వహిచిన 14 క్రికెట్ జట్లకు జ్ఞాపికలు, ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు గుడాల ఈశ్వరరావు, సుదర్శన్, శ్రీధర్, సంపత్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

హై స్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



గ్రూప్ ఫొటో దిగిన పూర్వ విద్యార్థులు

గాజువాక, ఫిబ్రవరి 4: గాజువాక హైస్కూల్‌లో 1990-91లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం పాఠశాల ఆవరణలో ఉత్సాహభరితంగా సాగింది. పూర్వ విద్యార్థులందరూ నాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ.. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆనందంగా గడిపారు. ఆటపాటలు, కబుర్లు చెప్పుకుంటూ సాయంత్రం వరకు ఎంజాయ్ చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కరణంరెడ్డి నరసింగరావు, సిరసపల్లి నూకరాజు, చట్టి గోపి, అనిత్, నరసింగరావు, బాలకుమార్, రాజు, నూకరాజు, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీలో పలువురు చేరిక

గోపాలపట్నం, ఫిబ్రవరి 4: జీవీఎంసీ 40వ వార్డుకు చెందిన గేదెల రమణతో పాటు పలువురు ఆదివారం ఎమ్మెల్యే పి.గణబాబు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. తమ నివాసంలో జరిగిన కార్యక్రమంలో కార్యకర్తలకు ఆయన టీడీపీ కండువాలు వేశారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ పార్టీ విజయానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.

89వ వార్డులో పలువురికి పింఛన్లు పంపిణీ

గోపాలపట్నం, ఫిబ్రవరి 4: వైసీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆర్థిక సాయంతో 89వ వార్డులోని పలువురుకి ఆదివారం పింఛన్లు అందజేశారు. పలు కారణాల వల్ల పింఛన్లు కోల్పోయిన వారికి ప్రతినెలా ఆనంద్‌కుమార్ సొంత నిధులతో పింఛన్లు అందజేస్తున్నట్టు వైసీపీ వార్డు అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపి తెలిపారు.

కళలకు నిలయం విశాఖ



బృందగానం చేస్తున్న గాయనీగాయకులు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 4: కళలకు విశాఖనగరం నిలయంగా నిలుస్తోందని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మెలోడీ క్రియేటర్స్ ఆధ్వర్యంలో 'చందురిని మించు అంద మొలికించు' పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించారు. కళా రంగ ప్రముఖులు కొణతాల రాజు, సత్యనారాయణ, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, చీరాల ఉష హాజరై తొలుత ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాయనీ, గాయకులు ఆలపించిన సినీ గీతాలు అలరించాయి. మెలోడీ క్రియేటర్ అధ్యక్షులు సీహెచ్‌వీ సత్యనారాయణ, కన్వీనర్ ప్రభాకర్,ఎం.ఎస్.మాధవ్, సన్‌మూర్తి, ప్రసాద్, మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

11న కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం

మహారాణిపేట: వన్‌టౌన్‌లోని శ్రీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఈ నెల 11న వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ అధ్యక్షుడు అరిశెట్టి దినకర్, కార్యదర్శి గ్రంధి రామకృష్ణారావు తెలిపారు. ఆదివారం ఆలయంలో ఇందుకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. కోశాధికారి సుగ్గు శివకుమార్, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి

» టీడీపీ సౌత్ ఇన్‌చార్జి గండి బాబ్జీ

మహారాణిపేట, ఫిబ్రవరి 4: టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే, రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తుందని సౌత్ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. దక్షిణ నియోజకవర్గానికి చెందిన 50 మంది యువకులు టీడీపీలో చేరారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో బాబ్జీ వీరందరికీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మజ్జి శ్రీను, కనకరాజు, నరసింగరావుతో సహా పలువురు ఉన్నారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. అలా గే, రానున్న ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రావటానికి కృషి చేయాలని బాబ్జీ కోరారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే, రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తుందన్నారు. యువతకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి చేరిన యువకులతో సౌత్ ఇన్‌చార్జి గండి బాబ్జీ

ఘనంగా సంస్కృతి, సంప్రదాయాల ఉత్సవం



ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న బ్రహ్మకుమారీలు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 4 : రైల్వేన్యూకాలనీలోని ప్రజాపిత బ్రహ్మకుమారీల ఈశ్వరీయ విశ్వ విద్యాలయం రాయల్ ప్యాలెస్‌లో ఆదివారం 'నమస్కారం మన సంస్కృతి సాంప్రదాయాలు' పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. రష్యా నుంచి విచ్చేసిన రాజయోగిని బ్రహ్మకుమారీలు సుధ, ఇరినా, విక్టోరియా, రూప, శశికళ తదితరులు ఈ ఉత్సవాన్ని పారంభించారు. ఈ సందర్భంగా సుధ మాట్లాడుతూ రష్యాలో గత 36 ఏళ్లుగా చేపడుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను వివరించారు. వివిధ జిల్లాల నుంచి బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

లౌకిక శక్తులంతా బీజేపీని గద్దె దింపాలి: ఆర్పీఐ



మాట్లాడుతున్న భారత్ రిపబ్లికన్ పార్టీ ప్రధాన కార్యదర్శి మోహన్‌లాల్ పాటిల్

సీతమ్మధార, ఫిబ్రవరి 4: దళిత, లౌకిక బహుజన శక్తులన్నీ కలిసి రానున్న ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని భారత రిపబ్లికన్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్ లాల్ పాటిల్ పిలుపునిచ్చారు. బుల్లయ్య కళాశాల పక్కనగల అంబేడ్కర్ భవన్ ఆవరణలో పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో అణగారిన కులాలపై కుట్ర జరుగుతుందన్నారు. ఆర్పీఐ జాతీయ ఉపాధ్యక్షులు బొడ్డు కల్యాణరావు, ప్రొఫెసర్ సత్యపాల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దక్షిణ భారత కార్యనిర్వాహక అధ్యక్షులు వై.అంజయ్య, ఏపీ అధ్యక్షులు ఎస్.డేవిడ్‌రాజు, ఏపీ కార్యదర్శి పిట్టా వరప్రసాద్, ఆర్పీఐ సీనియర్ నాయకులు బత్తుల గౌతమ్‌బాబు, ఎం.వెంకటరావు, రాజాన సరస్వతి పాల్గొన్నారు

మానసిక దివ్యాంగులకు సేవ



మతిస్థిమితంలేని వారికి క్షవరం చేయిస్తున్న సత్యసాయి సంస్థల ప్రతినిధులు

జ్ఞానాపురం, ఫిబ్రవరి 4: మానసిక దివ్యాంగులకు శ్రీసత్యసాయి సేవా సంస్థల జిల్లా యువజన విభాగం ఆధ్వర్యంలో సపర్యలు చేశారు. జ్ఞానాపురం రైల్వే స్టేషన్ పరిసరాల్లో ఉన్న 60మంది ఇలాంటి వారిని గుర్తించి క్షవరం చేయించి, స్నానాలు చేయించారు. మంచి భోజనం ఏర్పాటు చేసి పాదరక్షలు అందించారు. డి.రాఘవరావు, సర్వశ్రీరాజు, మోహనరావు, రమేష్, ప్రభాకర్, అక్కునాయుడు పాల్గొన్నారు.

సీనియర్ టెన్నిస్ టోర్నీ ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న సీపీ రవిశంకర్, అతిథులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 4: అయిస్టా నిర్వహిస్తున్న అఖిల భారత్ సీనియర్ టెన్నిస్ ర్యాంకింగ్ చాంపియన్‌షిప్ టోర్నీ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఆఫీసర్స్ క్లబ్‌లో జరుగుతున్న ఈ టోర్నీకి నగర పోలీసు కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్ ముఖ్య అతిథిగా హాజరై బెలూన్లను గాల్లో ఎగురవేసి ప్రారంభించారు. ఈ టోర్నీలో దేశ వ్యాప్తంగా సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొనడం అభినందనీయమన్నారు. రిటైర్డ్ డీజీపీ పి.సాంబశివరావు, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి డాక్టర్ శాంతరావు, అయిస్టా ప్రతినిధులు సతీష్, ప్రేమ్‌చంద్, డీఎస్ఎన్.రాజు పాల్గొన్నారు.

బనారస్ రైలుకు అదనపు కోచ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 4: ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ-బనారస్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (18311/18312) ఒక ఫస్ట్ ఏసీ, ఒక ఏసీ పాంట్రీకార్ కోచ్‌లను జత చేస్తున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. విశాఖ-బనారస్ ఎక్స్‌ప్రెస్‌కు (18311) ఈనెల 14 నుంచి, తిరుగు ప్రయాణంలో బనారస్-విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు (18312) ఈనెల 15 నుంచి అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

రానున్న ఎన్నికల్లో ప్రాధాన్యం కల్పించాలి

» టీడీపీ నేత శ్రీభరత్‌కు ముస్లిం మైనారిటీలు వినతి



శ్రీభరత్‌కు వినతి పత్రం ఇస్తున్న ముస్లిం నేతలు

మహారాణిపేట, ఫిబ్రవరి 4: గత 30 ఏళ్లుగా రాజకీయ ప్రాతినిధ్యం లేని తమకు ఈసారి ఎన్నికల్లోనైనా న్యాయం చేయాలని టీడీపీ విశాఖ జిల్లా ముస్లిం మైనారిటీ నాయకులు విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎం. శ్రీభరత్‌ను కోరారు. ఆదివారం రాత్రి ముస్లిం నాయకులు భరత్‌ను ఆయన నివాసంలో కలిసి వినతి పత్రాన్ని అందించారు. అనంతరం అబ్దుల్ చిన రహమాన్ మాట్లాడుతూ, ఉత్తరాంధ్రలో ముస్లింలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయగల స్థాయిలో ఉన్నా తమకు ఎటువంటి కల్పించడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. రానున్న ఎన్నికల్లో తమ సామాజిక వర్గానికి అసెంబ్లీ టికెట్ ఇస్తే గెలిపించు కుంటామని తెలిపారు. ఈసందర్భంగా భరత్ తమ కోరికను అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో జఫురుల్లా, షేక్ కాలీషా, షేక్ రహ్మతుల్లా, మహ్మద్‌గౌస్, బాబ్జీ అబ్దుల్ బాషా, యాసిన్ హిమాయుతాల్లా తదితరులు పాల్గొన్నారు.

రైల్వే జోన్ ఏర్పాటులో జగన్ ప్రభుత్వం విఫలం

» జనసేన ఉత్తరాంధ్ర సమన్వయకర్త నాగలక్ష్మి

సీతంపేట, ఫిబ్రవరి 4: పోలవరం సాగునీటి ప్రాజెక్ట్ పూర్తి, రైల్వే జోన్ విశాఖకు తీసుకురావడంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని జనసేన ఉత్తరాంధ్ర సమన్వయకర్త నాగలక్ష్మి ఆరోపించారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ వస్తే ఉత్తరాంధ్ర అభివృద్ధికి వీలవుతుందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని స్పష్టం చేశారు. వ్యవసాయ ఉత్పత్తులు రవాణా సులువు అవుతుందన్నారు. గత ఎన్నికల్లో సీఎం జగన్మోహన్‌రెడ్డి పార్టీకి చెందిన ఎంపీలను పూర్తిస్థాయిలో గెలిపించినా ఏం చేయలేకపోయారన్నారు. ఎంతసేపూ అప్పులు తేవడం, ప్రభుత్వ ఆస్తులు విక్రయించడం తప్ప ఆయన ఇంకేమీచేయలేకపోయారని విమర్శించారు. సమావేశంలో ఉత్తరాంధ్ర ప్రాం తీయ సమన్వయకర్త కిరణ్‌ప్రసాద్, త్రివేణి, రూపదేవి పాల్గొన్నారు.

క్యాన్సర్ ఆస్పత్రి సేవలు ప్రశంసనీయం

సీతమ్మధార, ఫిబ్రవరి 4: సీతమ్మధారలోని లయన్స్ క్యాన్సర్ అండ్ జనరల్ ఆసుపత్రి సేవలు ప్రశంసనీయమని లయన్స్ క్లబ్ పూర్వ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఫ్రేంక్ మోర్ తెలిపారు. ఆదివారం ఆయన ఆస్పత్రిని ఆయన సందర్శించారు. వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా ఆసుపత్రిలో మల్టీ స్పెషాల్టీ క్యాంప్‌ను నిర్వహించారు. ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ వి.ఉమామహేశ్వరరావు, డాక్టర్ ఎ.గోపాలరావు, క్లబ్ పూర్వ డైరెక్టర్ వి.విజయకుమార్ రాజు, డాక్టర్లు మోహన్ పాత్రో, కళ్యాణ్ ప్రసాద్, ఎం.ఉషారాజు, అంబటి భవాని, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

400 మందికి ఉచిత వైద్య సేవలు

సీతమ్మధార, ఫిబ్రవరి 4: గ్రేటర్ 24వ వార్డు నక్కవానిపాలెం ఏఎంజీ ఆస్పత్రి ఎదుట గల అపార్ట్‌మెంట్ ఆవరణలో ఆదివారం పీవీ సహాయ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పీవీవీఎస్ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ శిబిరాన్ని జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ నరేష్‌కుమార్ ప్రారంభించారు. ఆంధ్రా ఆస్పత్రి, విశాఖ ఆస్పత్రులకు చెందిన వైద్యులు రోగులకు వివిధ వైద్య పరీక్షలను నిర్వహించారు. 400మంది వైద్య సేవలు పొందారు. ట్రస్ట్ ప్రతినిధులు వి.సాంబశివరావు, వీవీ రమణమూర్తి, మూర్తి, కేఎస్ఎన్ మూర్తి, జి.సాం బమూర్తి, పి.శ్రీనివాసరావు సహకరించారు.

ప్రభుత్వ మద్యం దుకాణంలో అగ్ని ప్రమాదం

మహారాణిపేట, ఫిబ్రవరి 4: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రభుత్వ మద్యం దుకాణంలో అగ్ని ప్రమాదం జరిగింది. రూ. 32 లక్షల విలువైన మద్యం ధ్వంసమైంది. నగరంలోని సూర్యాబాగ్ ప్రాంతంలోని నిర్వహిస్తున్న ఈ మద్యం దుకాణంలో శనివారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో 10,900 మద్యం సీసాలు ధ్వంసమై, సుమారు రూ. 32 లక్షల ఆస్తికి నష్టవాటిల్లినట్టు నిర్వాహకులు ఫిర్యాదు చేశారు.పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీలో లింగేశ్వరరావుకు స్వర్ణం

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 4: అఖిల భారత్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన బీవీఎస్‌కే లింగేశ్వరరావు స్వర్ణ పతకం సాధించాడు. మొహాలిలో ఆదివారం జరిగిన 55 ప్లస్ డబుల్స్ ఫైనల్స్‌లో చెన్నైకు చెందిన డాక్టర్ మారన్ తంగవేలుతో కలిసి అద్భుతంగా రాణించి స్వర్ణ పతకం కైవసం చేసుకున్నాడు. ఈ విజయంపై పలువురు సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

భామా కలాపం-2 చిత్ర బృందం సందడి



మాట్లాడుతున్న హీరోయిన్ శరణ్య

మహారాణిపేట, ఫిబ్రవరి 4: భామాకలాపం-2 సినిమా కుటుంబ సమేతంగా అలరిస్తుందని సినీ హీరోయిన్ శరణ్య అన్నారు. సీనియర్ హీరోయిన్ ప్రియమణి ప్రధాన పాత్రలో నటించిన భామా కలాపం-2 సినిమా ఈనెల 16న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో యూనిట్ చిత్ర ప్రమోషన్‌లో భాగంగా విశాఖలో ఆదివారం సందడి చేసింది. ఈ సందర్భంగా ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరోయిన్ శరణ్య మాట్లాడారు. అభిమన్యు దర్శకత్వంలో బాపినీడు బి. సుధీర్‌ఈ చిత్రాన్ని నిర్మించగా ప్రశాంత్ విహారి సంగీతం సమకూర్చినట్టు చెప్పారు.బాలివుడ్ నటి షీరత్‌కపూర్ తదితరులున్నారు.

పారిశ్రామిక అభివృద్ధిపై చర్చకు సిద్ధం

మంత్రి గుడివాడ అమర్



విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాల్లో జరిగిన పారిశ్రామిక అభివృద్ధిపై చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. రాష్ట్రం నుంచి పరిశ్రమలు, ఐటీ కంపెనీలు తరలిపోయాయని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయని, దీనిపై వారు చర్చకు రావాలని సవాల్‌చేశారు. టీడీపీ హయాంలో జరిగిన పారిశ్రామిక అభివృద్ధికి, వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగి అభివృద్ధికి చాలాతేడా ఉందన్నారు. చంద్రబాబు హయాంలో రూ.30 వేల కోట్లు నుంచి రూ.40 వేల కోట్ల విలువైన పారిశ్రామిక ఒప్పందాలు జరిగితే, తమప్రభుత్వ హయాంలో రూ.90 వేల కోట్లకుపైగా పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయన్నారు.

ఫిషింగ్ హార్బర్‌లో శాంతి హోమం

మహారాణిపేట, ఫిబ్రవరి 4: ఫిషింగ్ హార్బర్‌లో ఆదివారం జటారుద్ర రాజ శ్యామల గంగాశ్వేర మహా యజ్ఞం నిర్వహించారు. ఏపీ మెకానైజ్డ్ ఫిషింగ్ బోట్ల ఆప రేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకీ రామ్ ఆధ్వర్యంలో ముందుగా గంగమ్మతల్లికి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నవంబరులో ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదం మత్స్యపరిశ్రమపై తీవ్రప్రభావం చూపిందన్నారు. ఈ స్థితిలో హార్బర్‌ను, విశాఖ నగరాన్ని కాపాడాలని మూడురోజుల పాటు శాంతి హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు దూడ పోలయ్య గుంటు దానయ్య, మైలపిల్లి లక్ష్మణరావు, మసేను, రాము శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు మేనిఫెస్టోల్లో చేర్చాలి: ఎస్‌టీయూ

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 4: ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలపై హామీలను రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలనిఎస్‌టీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్‌టీయూ విశాఖ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని డాబాగార్డెన్స్‌లో నిర్వహించారు.ముందుగా ఎస్‌టీయూ వ్యవస్థాపకుడు మక్దుం మోహియుద్దీన్ 177వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం విశాఖ జిల్లా సంఘ అధ్యక్షునిగా పి.దేముడుబాబు, ప్రధాన కార్యదర్శిగా ఇమంది పైడిరాజు, ఆర్థిక కార్యదర్శిగా పి.గోపాలకృష్ణ ఎన్నికయ్యారు. అనకాపల్లి అధ్యక్ష, కార్యదర్శులుగా ఆచంట రవి, పరదేశి , ఆర్థిక కార్యదర్శిగా గంగాధర్ ఎన్నికయ్యారు. అల్లూరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా గిడ్డి వరలక్ష్మి, శేషగిరిరావు , రాష్ట్ర సభ్యులుగా ఆర్.జగదీష్‌బాబు, చంద్రపద్మావతి, మహిళా కార్యదర్శిగా సునీత ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకుడిగా త్రినాథ్‌బాబు వ్యవహరించారు.

ఇనుప ఖనిజం రవాణాలో రికార్డు

విశాఖపట్నం, ఫిబ్రవరి 4: ఇనుప ఖనిజం రవాణాలో వాల్తేరు డివిజన్ రికార్డు నెలకొల్పింది. ఈ జనవరి నెలాఖరు నాటికి 18.34 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజం లోడింగ్ చేసింది. గత ఏడాదితో పోల్చితే 25.36 శాతం పురోగతి సాధించిందని సీనియర్ డీసీఎం ఏకే.త్రిపాఠి తెలిపారు. ఈ సందర్భంగా డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఎన్ఎండీసీ, ఆర్ఐఎన్ఎల్, జేఎస్‌డబ్ల్యు స్టీల్, కేఐఓసీఎల్ లిమిటెడ్ సంస్థల సమన్వయంతో రికార్డు సాధించామని పేర్కొన్నారు.

ఆర్థిక సమస్యలతో అధ్యాపకుడు ఆత్మహత్య



రవికుమార్ మృతదేహం

సీతంపేట, ఫిబ్రవరి 4: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది ఓ ప్రైవేట్ కళాశాల అధ్యాపకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. నాలుగో పట్టణ స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాలివి...దొండపర్తి వెంకటాద్రినగర్‌కి చెందిన గంట్ల రవికుమార్ (45)... భార్య పావని, కుమారుడితో కలిసి నివాసం ఉంటున్నారు. రవికుమార్ నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. భార్య కూడా ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. అయితే, కొద్దిరోజులుగా ఆర్థిక సమస్యల నేపథ్యంలో అతని భార్య పావని ఇంట్లో మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడారు. ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి ఇంటికి తిరిగి వచ్చిన రవికుమార్ మనస్తాపంతో ఇంట్లో ఫ్యాన్‌కి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చిన రవికుమార్ కుమారుడు తండ్రిని చూసి కేకలు వేశాడు. దీంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉరి వేసుకుని బాలుడి ఆత్మహత్య

ఆరిలోవ, ఫిబ్రవరి 4 : ఆరిలోవ ప్రాంతానికి చెందిన ఓ బాలుడు (17) బాలిక ప్రేమించలేదన్న మనస్తాపంతో ఆదివారం తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బాలుడు నగరంలోని ఓ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు.తన ఇంటికి సమీపంలోని బాలికను ప్రేమించాడు. దానికి ఆమె అంగీకరించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

'పవన్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవు'

సీతంపేట, ఫిబ్రవరి 4: ఏలూరులో జరిగిన సిద్ధం సభలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తమ అధినేత పవన్ కల్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని జనసేన చోడవరం జనసేన పార్టీ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నా అక్కా చెల్లెళ్లు అని చెప్పే ముఖ్యమంత్రికి సొంత చెల్లెళ్లకు న్యాయం చేయడం చేతకాలేదా అని ప్రశ్నించారు. వారు అన్నను ప్రశ్నిస్తున్నప్పుడు సమాధానం చెప్పలేని దౌర్భాగ్య స్థితిలో జగన్ ఉన్నారన్నారు. ఆడపిల్లలను చూడకుండా వైసీపీ సోషల్ మీడియతో పలు రకాలుగా మాట్లాడిస్తున్నారన్నారు.

చెన్నైలో నిందితుడు!

... 5వ పేజీ తరువాయి

పంపించారు. ఇదిలావుండగా శనివారం ఉదయానికి నిందితుడు గంగాధర్‌గా గుర్తించడంతో పాటు ఎక్కడికి వెళ్లేందుకు టికెట్లు తీశాడు, అతని లోకేషన్ ఎక్కడ అనేది తెలుసుకున్నప్పటికీ శనివారం మధ్యాహ్నం వరకూ నగరంలోనే ఉన్నా గుర్తించలేకపోవడం, పట్టుకోలేకపోవడంపై సీపీ రవిశంకర్ అయ్యన్నార్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఆదివారం పలుమార్లు అధికారులతో సమావేశమై గంగాధర్‌ను అదుపులోకి తీసుకోలేకపోవడానికి కారణాలు, వైఫల్యాలపై చర్చించడంతోపాటు ఇప్పుడు ఏం చేయాలనేదానిపైనా చర్చించినట్టు సమాచారం. ఎయిర్‌పోర్ట్‌లో నిందితుడు ఉన్నప్పటికీ గుర్తించడంలో సంబంధిత అధికారులు విఫలమవడానికి కారణాలపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని జాయింట్ పోలీస్ కమిషనర్‌ను ఆదేశించారని, అందులో భాగంగానే జాయింట్ సీపీ ఫకీరప్ప ఆదివారం ఎయిర్‌పోర్టుకు వెళ్లి పలు అంశాలను పరిశీలించినట్టు పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

గిల్ సూపర్ సెంచరీ

... 5వ పేజీ తరువాయి

వెనుదిరిగాడు. లోకల్ బాయ్ శ్రీకర్ భరత్ (6) మరోసారి అభిమానులను తీవ్రంగా నిరాశపరిచాడు.

ఆదుకున్న శుభమన్ గిల్

వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన శుభమన్ గిల్ (104) తొలి బంతి నుంచి దూకుడుగా ఆడాడు. రెహన్ అహ్మద్ బౌలింగ్‌లో వరుసగా రెండు బౌండరీలు కొట్టి కేవలం 60 బంతుల్లో ఎనిమిది బౌండరీలు, ఒక సిక్సర్‌తో అర్ధ సెంచరీ సాధించాడు. ఈ దశలో మరో ఎండ్‌లో శ్రేయాస్ అయ్యర్ (29), పటిదర్ (9) వికెట్లు పడిపోయినా గిల్ జోరు తగ్గించలేదు. 41వ ఓవర్‌లో రెహన్ అహ్మద్ బౌలింగ్‌లో మరోసారి విరుచుపడి వరుసగా లెగ్ స్టంప్ మీదుగా భారీ సిక్సర్, మిడ్ వికెట్ మీదుగా బౌండరీ, స్క్వేర్ లెగ్ మీదుగా మరో బౌండరీ బాది స్కోరు బోర్డును పరిగెత్తించాడు. 52వ ఓవర్‌లో బషీర్ బౌలింగ్‌లో సింగిల్ చేసి సెంచరీ పూర్తిచేశాడు. శుభమన్ గిల్‌కు విశాఖలో ఇది తొలి సెంచరీ కాగా, టెస్టు కెరీర్‌లో రెండోది కావడం విశేషం. సెంచరీ తర్వాత మరో నాలుగు పరుగులు జోడించిన గిల్... 55వ ఓవర్ చివరి బంతికి బషీర్ బౌలింగ్‌లో బెన్ ఫోక్స్‌కు క్యాచిచ్చి ఐదో వికెట్‌గా పెవిలియన్ చేరాడు. మరో ఎండ్‌లో గిల్‌కు సహకరిస్తూ స్కోరు బోర్డును ముందుకు నడిపించిన అక్షర పటేల్ (45) హార్ట్‌లీ బౌలింగ్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. రెండు బౌండరీలు, ఒక సిక్సర్‌తో కొద్దిసేపు మెరుపులు మెరిపించిన అశ్విన్ (26) రెహన్ అహ్మద్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. లోకల్ బాయ్ శ్రీకర్ భరత్ (6), కులదీప్ యాదవ్ (0), బుమ్రా (0) విఫలమవడంతో భారత్ స్కోర్ 255 పరుగులకు పరిమితమయింది.

హార్ట్‌లీ స్పిన్ మాయాజాలం

తొలి టెస్టులో భారత్ బ్యాటర్లను ముప్పతిప్పలు పెట్టిన స్పిన్నర్ హార్ట్ లీ రెండో టెస్టు సెకెండ్ ఇన్నింగ్స్‌లో భారత్ బ్యాటింగ్‌ను దెబ్బతీశాడు. మూడో రోజు ఆటలో శ్రేయాస్ అయ్యర్, అక్షరపటేల్, కులదీప్ యాదవ్, బుమ్రాలను అవుట్ చేశాడు.

ఇంగ్లండ్ 67/1

రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 14 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 67 పరుగులు చేసింది. బుమ్రా బౌలింగ్‌లో కీపర్ భరత్ అద్భుతమైన క్యాచ్ పట్టి ఓపెనర్ బెన్ డకెట్‌ను (28; 6 ఫోర్లు) అవుట్ చేశాడు. జాక్ క్రాలీ 29 నాటౌట్, రెహన్ అహ్మద్ 9 నాటౌట్‌తో క్రీజులో ఉన్నారు.

పోటెత్తిన ప్రేక్షకులు

మూడోరోజు ఆదివారం కావడంతో మ్యాచ్‌ను వీక్షించేందుకు భారీ సంఖ్యలో ప్రేక్షకులు తరలివచ్చారు. పెవిలియన్ వైపు స్టాండ్స్ నిండిపోయాయి. భారత్ బ్యాటింగ్ జరిగినంతసేపు కేరింతలు, చప్పట్లతో స్టేడియం హోరెత్తింది. సుమారు ఆరు వేల మంది విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించినట్టు ఏసీఏ కార్యదర్శి గోపినాథరెడ్డి తెలిపారు. క్లబ్ క్రికెటర్లను కూడా ఎక్కువ సంఖ్యలో అనుమతించామన్నారు. అన్ని స్టాండ్స్‌లో తాగునీరు, స్నాక్స్ అందుబాటులో ఉంచామన్నారు.

మ్యాచ్ తిలకించిన రోజర్ బిన్నీ

భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) అధ్యక్షుడు రోజర్ బిన్నీ ఆదివారం మ్యాచ్‌ను వీక్షించారు. ఏసీఏ కార్యదర్శి గోపినాథరెడ్డి, ఇతర ప్రతినిధులు అతనికి స్వాగతం పలికారు. ఆట ప్రారంభానికి ముందు స్టేడియంలో బీసీసీఐ జెండాను బిన్నీ ఆవిష్కరించారు. అతనితో పాటు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ చాముండీశ్వరి నాథ్ హాజరయ్యారు. నగర పోలీసు కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యనార్ గ్యాలరీలో కూర్చుని మ్యాచ్‌ను తిలకించారు. మూడో రోజు మ్యాచ్‌లో ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ సందడి చేశారు. సౌత్ ఎండ్ ఈస్ట్ లోవర్‌లో కూర్చుని పాల్ మ్యాచ్ చూస్తుండగా అభిమానులు అతనితో సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు.

డ్రెస్సింగ్ రూమ్‌లోకి ఆగంతకుడు

మూడో రోజు ఆట ముగిసిన తర్వాత గుర్తు తెలియని యువకుడు భారత్ డ్రెస్సింగ్ రూమ్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించాడు. భద్రతా సిబ్బంది అప్రమత్తమై అతడిని పట్టుకుని, కొద్దిసేపు విచారించి వదిలేసినట్టు సమాచారం.

పాత నేరస్థులకు కౌన్సిలింగ్

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 4 : ద్వారకా సబ్ డివిజన్ ఆరిలోవ, ఎంవీపీ కాలనీ, ద్వారకానగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని పాత నేరస్థులకు ఎంవీపీ స్టేషన్‌లో ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటివరకూ ఎలాంటి నేరాలు, వివాదాలు, ఘర్షణల జోలికి వెళ్లకుండా శాంతియుత జీవనం సాగించిన వారిపై షీట్లు తీసివేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న బంగారం పట్టివేత

ఆనందపురం, ఫిబ్రవరి 4 : ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని భీమిలి క్రాస్ రోడ్డు వద్ద అక్రమంగా తరలిస్తున్న బంగారం బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నట్టు అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సిటీ టాస్క్‌ఫోర్స్ ఏ.త్రినాథరావు తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సీపీ రవిశంకర్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ మల్లేశ్వరరావు, సిబ్బందితో కలిసి భీమిలి క్రాస్ రోడ్డు వద్ద శనివారం వాహన తనిఖీలు చేపట్టామన్నారు. ఈమేరకు బస్సులో ఇద్దరు వ్యక్తులను సోదా చేసి వారి నుంచి ఏడు బంగారం బిస్కెట్లు, సిల్వర్ బ్రెస్ లైట్ స్వాధీనం చేసుకున్నామన్నారు.

బాలల హక్కుల పరిరక్షణపై ప్రాంతీయ సదస్సు రేపు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 4 : నగరంలోని రాయల్ ఫోర్ట్ హోటల్‌లో బాలల హక్కుల పరిరక్షణపై ఆరు జిల్లాల అధికారులతో మంగళవారం ప్రాంతీయ సదస్సు నిర్వహించనున్నట్టు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం తెలిపారు. ఆదివారం వారు ఎంవీపీ కాలనీలో విలేకరులతో మాట్లాడారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో బాలల హక్కుల రక్షణ, ప్రభుత్వాలు రూపొందించిన చట్టాల అమలులో ఎదురవుతున్న సమస్యలు, సవాళ్లు అన్న అంశంపై సదస్సులో చర్చించనున్నట్టు వారు చెప్పారు.

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, ఫిబ్రవరి 4 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా ఆదివారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై ఉంచారు. అలయ పద్మనిధి నుంచి బంగరు సంపెంగలను తీసి భక్తులతో స్పృశింపజేశారు. అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ నామానికొక స్వర్ణ పుష్పంతో పూజలు చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై స్వామివారి ఆర్జిత నిత్య కల్యాణం వైభవంగా జరిపారు.

క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

భీమునిపట్నం (రూరల్), ఫిబ్రవరి 4 : మండలంలోని అన్నవరం గ్రామంలో బాక్సింగ్ క్లబ్ సభ్యులకు అదే గ్రామానికి చెందిన ఎం. ఎల్లాజీ ఆదివారం క్రీడా దుస్తులు, ఇతర పరికరాలు అందించారు. స్టార్ బాక్సింగ్ క్లబ్ పేరుతో గ్రామానికి చెందిన యువకులు కొంతకాలంగా బాక్సింగ్ నేర్చుకుంటున్నారు. ఈమేరకు వారికి అవసరమైన దుస్తులు, బాక్సింగ్ కిట్లను ఎల్లాజీ క్లబ్ ఆవరణలో అందజేశారు.

నమ్మివానిపేటలో ఆధ్యాత్మిక ప్రచారం

తగరపువలస, ఫిబ్రవరి 4 : జీవీఎంసీ రెండో వార్డు పరిధిలోని నమ్మివానిపేటలో త్రైత సిద్ధాంత ప్రభోద సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఆధ్యాత్మిక గ్రంథాల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితికి చెందిన కె. త్రినాథరావు ఆధ్వర్యంలో సభ్యులు ఇంటింటికి వెళ్లి పండుగల విశిష్టత, ఆలయాల్లో పూజా విధానాలు, భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తి యోగ అధ్యాయంలో 16, 17 శ్లోకాలు వివరించి, వాటి అర్థాలను తెలియజేశారు.

'గిరిజన సంస్కృతిని పరిరక్షిద్దాం'

సింహాచలం, ఫిబ్రవరి 4 : సుదీర్ఘ చరిత్ర కలిగిన గిరిజన సంస్కృతిని పరిరక్షిద్దాం అని తూర్పు కనుమల గిరిజన సాంస్కృతిక యాత్ర ప్రముఖ్ డబ్బెటి నాగేశ్వరరావు తెలిపారు. యాత్ర రథం ఆదివారం సింహాచలం చేరిన సందర్భంగా తొలిపావంచా వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మన సంస్కృతిని వీడి అన్యమతాలను ఆశ్రయించడం సరికాదన్నారు.

సినిమా గైడ్

- **అంబాజీపేట మ్యారేజి బ్యాండు :** మెలోడి, రమాదేవి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), సప్తగిరి (తగరపువలస)
- **బూట్‌కట్ బాలరాజు :** మోహిని (గాజువాక),
- **ధీర :** కిన్నెర, మౌర్య (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **కిస్మత్ :** కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), విశేష్ (గాజువాక),
- **కెప్టెన్ మిల్లర్ :** వెంకటేశ్వర
- **నా సామిరంగ :** శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, సంగం, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 20,టమాటా 30, వంకాయలు (తెలుపు) 16, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 54, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 46, బీరకాయలు 54, ఆనపకాయలు 20, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 16, క్యారెట్ 24, దొండకాయలు 32, బంగాళా దుంపలు 20, అరటికాయ (పె)4, మునక్కాడలు (కిలో) 95, అల్లం (పాతది) 115, బరబటి 26, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 36, దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 360, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 52 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 32, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 56, చిలగడదుంపలు 28 , కంద 54, దేముడు చిక్కుడు 32, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 20, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	97
ఫారం ధర	--	117
విత్ స్కిన్	--	204
స్కిన్‌లెస్	--	214

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8 లో..

జోన్-2లో ఇండోర్ స్టేడియం

- ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు కమిషనర్ ఆదేశం
- స్థలాన్ని పరిశీలించిన సాయికాంత్ వర్మ



స్టేడియం స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

ఆరిలోవ, ఫిబ్రవరి 4 : నగరంలోని అన్ని జోన్లలో క్రీడా మైదానాలను అభివృద్ధి చేయనున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ తెలిపారు. ఆదివారం ఆయన జోన్-2 ఆరిలోవ హెల్త్ సిటీ సమీపంలో ఇండోర్ స్టేడియం ఖాళీ స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెల్త్‌సిటీ సమీపంలో ఉన్న 2.8 ఎకరాల్లో ఇండోర్ స్టేడియం నిర్మించనున్నట్టు చెప్పారు. అందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని పర్యవేక్షక ఇంజినీర్ శ్యామ్‌సన్ రాజును ఆదేశించారు. స్థలంలో ఉన్న చెట్లు తొలగించకుండా, రక్షణ గోడ నిర్మించి, స్టేడియంలో క్రీడాకారులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని చెప్పారు. అనంతరం హెల్త్ సిటీ రోడ్లను పరిశీలించి, ఇరువైపులా మొక్కలు నాటాలని సూచించారు. అలాగే పరిసరాలను శుభ్రం చేయించాలని హెల్త్ ఆఫీసర్ కిషోర్‌ను ఆదేశించారు. అనంతరం 12వ వార్డు శ్రీకాంత్‌నగర్ లేఅవుట్ సమీపంలో ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించి అక్కడ పార్కు నిర్మాణానికి ప్రణాళికలు తయారు చేయాలని తెలి పారు. 12వ వార్డు పెదగదిలి నుంచి తోటగరువు వెళ్లే మార్గంలో 60 అడు గుల రోడ్డు విస్తరణ, కల్వర్టు నిర్మాణా లను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోన్-2 కమిషనర్ కనక మహాలక్ష్మి, ఈఈ శాంతి రాజు, ఏసీపీ శాస్త్రి, ఏఈ సురేష్ పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'పై కమిషనర్ సమీక్ష

వెంకోజీపాలెం : నగరంలో ఈనెల 6వ తేదీ నుంచి జరిగే ఆడుదాం ఆంధ్ర రాష్ట్రస్థాయి క్రీడా పోటీల నిర్వహణపై జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ ఆదివారం తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముగింపు పోటీల్లో ఎటువంటి లోటుపాట్లకు తావివ్వరాదని, ప్లే గ్రౌండ్‌లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రం నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరుకా నుండడంతో వారికి అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ కేఎస్‌విశ్వనాథన్, వై. శ్రీనివాసరావు, ప్రధాన ఇంజినీరు రవికృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

సందర్శకులతో రుషికొండ తీరం కిటకిట



రుషికొండ తీరంలో సందర్శకులు

ఎండాడ, ఫిబ్రవరి 4 : జీవీఎంసీ 8,9 వార్డుల పరిధిలోని పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో ఆదివారం కిటకిటలాడా యి. తెన్నేటీ పార్కు, కైలాసగిరి, బంగ్లాదేశ్ నౌకఉన్న తీర ప్రాంతంతో పాటు రుషికొండ తీరానికి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు. తీర ప్రాంతాలకు పర్యాటకులు ఎక్కువగా రావడంతో రోడ్లపై వాహనాలు బారులు తీరాయి.

80 రోటరీ క్లబ్‌ల ద్వారా సేవలు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 4 : విజయవాడ నుంచి విశాఖ వరకు ఉన్న 18 రోటరీ క్లబ్‌ల ద్వారా ఐదు వేల మంది సభ్యులు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని రోటరీ క్లబ్ విశాఖ డిస్ట్రిక్ట్ -3020 జిల్లా గవర్నర్ సుబ్బారావు రావూరి తెలిపారు. మద్దిలపాలెం కాకతీయ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రోటరీ క్లబ్ సమాజంలో సాధికారిత లక్ష్యంగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతోందని, ఇందులో యువతను భాగస్వామ్యం చేస్తూ రోటరీ క్లబ్ యూత్ వింగ్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఆయనతో పాటు క్లబ్ డిస్ట్రిక్ అధ్యక్షుడు పి. నాగరాజు, క్లబ్ నిర్వాహకులు బి. బ్రహ్మానందం, బి. శంకరరావు, పి. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

'ఉద్యోగులను ఇబ్బంది పెట్టడం సరికాదు'

సిరిపురం, ఫిబ్రవరి 4 : జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏపీ పీటీడీ నేషనల్ యూనిటీ అసోసియేషన్ విశాఖ జిల్లా, రీజనల్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్ష ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రీజనల్ కార్యదర్శి బి. నీలకంఠం మాట్లాడుతూ క్రమశిక్షణ పేరుతో విశాఖ డీపీటీఓ 18 నెలలు నుంచి ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. సమస్యలు పరిష్కరించాలని మూడు వారాలుగా దీక్ష చేస్తున్నా.. పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

అప్పన్నను దర్శించుకున్న కేంద్ర ఎన్నికల అధికారి



ఎన్నికల అధికారి సంజయ్‌కుమార్



ఆలయంలో క్రికెటర్ వాషింగ్‌టన్ సుందర్

సింహాచలం, ఫిబ్రవరి 4 : వరాహలక్ష్మీ నృసింహస్వామిని కేంద్ర ఎన్నికల సంఘం అధికారి సంజయ్‌కుమార్ దంపతులు, భారత క్రికెటర్ వాషింగ్‌టన్ సుందర్ ఆదివారం దర్శించుకున్నారు. వారికి దేవస్థానం ఈఓ సింగల శ్రీనివాసమూర్తి అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభం ఆలింగనం తరువాత అంతరాలయంలో ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ప్రముఖుల గోత్ర నామాలతో పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శ నం అనంతరం పండితులు వేదాశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను, ప్రసాదాలను అందజేశారు.

'రా.. కదలిరా' విజయవంతం చేయండి

కొమ్మాది, ఫిబ్రవరి 4 : అనకాపల్లి జిల్లాలోని కె.కోటపాడు మండలం గొండుపా లెంలో సోమవారం జరిగే రా ...కదలిరా సభకు నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని టీడీపీ విశాఖ పార్లమెంట్ అధికార ప్రతినిధి దాసరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రా.. కదలిరా సభ విజయవంతంగా నిర్వహించడానికి తనను ఎలమంచిలి పరిశీలకుడిగా నియమించినట్టు చెప్పారు. సభకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

కార్మికులకు అండగా టీఎన్‌టీయూసీ



కుప్పం సభలో మాట్లాడుతున్న నాగోతి శివాజీ

మధురవాడ, ఫిబ్రవరి 4 : రాష్ట్రంలోని కార్మికుల హక్కుల పరిరక్షణకు తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ (టీఎన్‌టీయూసీ) అండగా ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగోతి శివాజీ అన్నారు. గత నెల 6న టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం నుంచి ప్రారంభమైన చంద్రన్న కార్మిక చైతన్య బస్సు యాత్ర 3347 కిలోమీటర్లు పూర్తిచేసుకొని ఆదివారం చిత్తూరు జిల్లా కుప్పంలో ముగిసింది. బస్సు యాత్రలో శివాజీతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా శివాజీ ఇక్కడి విలేకరులతో ఫోన్‌లో మాట్లాడుతూ కార్మికులకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందన్నారు. అన్ని ప్రాంతాల్లోని కార్మికుల సమస్యలను బస్సు యాత్రలో తెలుసుకున్నామని, అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఎంవీ స్పెషాలిటీ క్లినిక్స్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ సోమరాజు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 4 : ఎంవీపీకాలనీ పదకొండో సెక్టరులో ఎంవీ స్పెషాలిటీ క్లినిక్స్‌ను ప్రముఖ విద్యావేత్త, జీవీపీ సంస్థల కార్యదర్శి ప్రొఫెసర్ పి. సోమరాజు ఆదివారం ప్రారంభించారు. డాక్టర్ వి.సూర్యతేజ, డాక్టర్ అశ్విని ఆధ్వర్యంలో ఆసుపత్రిలో వయోవృద్ధులకు (జెరియాట్రిక్స్) ప్రత్యేక చికిత్స అందించనున్నట్టు యాజమాన్యం తెలిపింది.అలాగే పిల్లలు, పెద్దవారిలో వచ్చే హార్మోన్ సంబంధిత సమస్యలు డయాబెటిస్, ఊబకాయం, థైరాయిడ్, పీసీ ఓఎస్, పిట్యూటరీ గ్రంధి సమస్యలపై ప్రత్యేక వైద్యం అందుబాటులో ఉందని పేర్కొన్నారు. లేబొరటరీ, ఫార్మసీ, హోం కేర్, మధుమేహులకు ప్రత్యేక చెప్పుల తయారీ వంటివి కూడా ఉన్నాయని చెప్పారు.

సామూహిక సరస్వతీ పూజ



పూజలో పాల్గొన్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 4 : ఎంవీపీ కాలనీలోని టీటీటీ కల్యాణ మండపంలో శ్రీ శారదాంబా విద్యానికేతన్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక సరస్వతీ, మేధా దక్షిణామూర్తి కుంకుమ పూజలు నిర్వహించారు.మూడు రోజులుగా ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ముందుగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పంచాయతన హోమాలు, మహా పూర్ణాహుతి, అవబృదం, అన్నసమారాధన, సాయంత్రం సప్తవాద్య తరంగిణి, కూచిపూడి నాట్య ప్రదర్శన నిర్వహించారు.

అలరించిన శాస్త్రీయ నృత్యాలు

మధురవాడ, ఫిబ్రవరి 4 :మధురవాడ శిల్పారామంలో వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నగరానికి చెందిన సిద్ధేంద్రయోగి నాట్యాలయం కళాకారులు శాస్త్రీయ, జానపద నృత్యాలు ప్రదర్శించారు. కళాకారులు మోక్షిత, లిఖిత, సరళ, పద్మ నృత్యరీతులు సమకూర్చారు.

8 నుంచి దత్తాత్రేయస్వామి, అనఘాదేవి కల్యాణోత్సవాలు

పద్మనాభం, ఫిబ్రవరి 4 : మండలంలోని లింగన్నపేటలో ఉన్న వేదమాత గాయత్రి ఆలయ 11వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు దత్తాత్రేయ స్వామి, అనఘాదేవి కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధి రామకృష్ణానంద తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్సవాల్లో భాగంగా 8న మధ్యాహ్నం గాయత్రీదేవి, లలితాదేవి, దుర్గాదేవి విగ్రహాల ఊరేగింపు, 9న ఉదయం కనకధారా స్తోత్ర పారాయణం, 10న ఉదయం పెళ్లిరాట అనంతరం దత్తాత్రేయస్వామి, అనఘాదేవి కల్యాణం ఉంటుందని ఆయన చెప్పారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఆనందపురం, ఫిబ్రవరి 4 : క్రీడల వల్ల యువతలో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని ఆనందపురం సీఐ తిరుపతిరావు అన్నారు. సోమవారం ఆయన బంటుపల్లి పంచాయతీలో పిన్నింటి రాజు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ యువత చదువుతో పాటు క్రీడలపై కూడా దృష్టిసారించాలన్నారు. సర్పంచ్ లొడగల రమణ మాట్లాడుతూ టోర్నమెంట్‌లో 60 జట్లు పాల్గొన్నాయని, విన్నర్‌కు రూ. 50 వేలు, రన్నర్‌కు రూ. 25 వేలు నగదు బహుమతులు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు కోన శ్రీను, లారీ యూనియన్ అధ్యక్షుడు గండేడి సూర్యనారాయణ, బమ్మిడి తారక్, లోడగల సురేష్, దేవర తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా అమ్మవారి తీర్థం

సింహాచలం, ఫిబ్రవరి 4 : వరాహలక్ష్మీనృసింహస్వామి సోదరీమణులు, అడివివరం ప్రజల ఆరాధ్య దేవతలు పైడితల్లమ్మ, సత్తెమ్మతల్లి అమ్మవార్ల వార్షిక తీర్థ మహోత్సవాలను అధికారులు తూతూమంత్రంగా నిర్వహించారు. ఏటా సంక్రాంతి తరువాత పత్రికల్లో ప్రకటనలు, ఆటోల్లో ప్రచారం, దండోరా వంటి వాటి ద్వారా తీర్థానికి విస్తృత ప్రచారం కల్పిస్తారు. కానీ ఈసారి అవేవీ లేకుండా ఉత్సవాన్ని నామమాత్రంగా జరిపారు. అలాగే ఏటా దేవస్థానం ఈఓ అమ్మవారిని దర్శించుకుని పండ్లు, పుష్పాలు, చీర సమర్పిస్తుంటారు. ఈ ఏడాది ఆ ఆచారానికి కూడా స్వస్తి పలికారు.

రైల్వేజోన్ ఇప్పుడు గుర్తొచ్చిందా..?

సిరిపురం, ఫిబ్రవరి 4 : ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీజేపీ నాయకులకు రైల్వేజోన్ ఇప్పుడు గుర్తొ చ్చిందా అని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంక దండి ఎద్దేవా చేశారు. ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వం విభజన హామీల అమలుకు కొంతవరకు భూములిచ్చినా వైసీపీ మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. బీజేపీ నాయకులకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. రాష్ట్రానికి ఇవ్వాల్సిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖపై దొంగ ప్రేమ చూపిస్తున్న ఎంపీ జీవీఎల్‌కు ప్రభుత్వం వెంటనే నాటక రత్న బిరుదు ప్రకటించాలని ఎద్దేవా చేశారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : కేన్సర్ పట్ల అవగాహన కలిగి ఉండాలని మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ వి. మురళీకృష్ణ అన్నారు. అంతర్జాతీయ కేన్సర్ దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం బీచ్ రోడ్డులో వాక్‌థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేన్సర్‌ను ముందుగా గుర్తించే కొన్ని పరీక్షలు ఉన్నాయని, వాటిని చేయించుకోవడం వల్ల కేన్సర్ కణాలను ముందుగానే గుర్తించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు, నగరవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వాక్‌థాన్‌లో పాల్గొన్న పలు సంస్థల ప్రతినిధులు

కేన్సర్ వల్లే ఎక్కువ మరణాలు

వెంకోజీపాలెం : దేశంలో అత్యధిక మరణాలకు కేన్సర్ కారణమని, ప్రపంచ వ్యాప్తంగా ఏటా కోటి మంది కేన్సర్‌తో మరణిస్తున్నారని అంకాలజిస్టు, చీఫ్ కన్సల్టెంట్ రేడియేషన్ డాక్టర్ అభిలాష్ గవ్రరాజు అన్నారు. ప్రపంచ కేన్సర్ డే సందర్భంగా ఆదివారం మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో 'క్లోజ్ ది కేర్ గ్యాప్' అన్న థీమ్‌తో కేన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన దేశంలో ఏటా పదకొండు లక్షల మందికి కేన్సర్ బారిన పడుతున్నారని చెప్పారు. అనంతరం మెడికవర్ ఆసుపత్రి, భక్త మార్కండేయ ట్రస్టు సంయుక్తంగా శంకరమఠం దరి పద్మశాలి భవనంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ జాన్ మనోహర్

ముగిసిన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు

భీమునిపట్నం, ఫిబ్రవరి 4 : పట్టణంలోని ఫుట్‌బాల్ మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి (అండర్ -14) రగ్బీ పోటీలు ఆదివారంతో ముగిసాయి. బాలికల విభాగంలో కర్నూలు, ప్రకాశం, అనంతపురం జట్లు మొదటి మూడు స్థానాల్లో నిలవగా, బాలుర విభాగంలో కర్నూలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నాయి. విజేతలకు నగర అసిస్టెంట్ పోలీసు కమిషనర్ (ట్రాఫిక్) ఎం. జాన్ మనోహర్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, ది బ్లిస్ కేటరింగ్స్ అధినేత లక్ష్మీ లావణ్య, కైతపల్లి శ్రీనివాసరావు, మైలపల్లి లక్ష్మణరావు, విశాఖ రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు లలిత్‌కుమార్, కార్యదర్శి కిషోర్, కోశాధికారి అరుణ్ కుమార్, ఉపాధ్యక్షుడు ఎన్. శ్రీను పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు టికెట్ ఇవ్వకుంటే ఎన్నికల్లో ఓడిస్తాం



సిరిపురం, ఫిబ్రవరి 4 : వచ్చే ఎన్నికల్లో బ్రాహ్మణులకు టికెట్ ఇవ్వని పార్టీలను ఓడించాలని బ్రాహ్మణ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.ఆదివారం సిరిపురం ద్రోణంరాజు సర్కిల్ నుంచి బ్రాహ్మణ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బ్రాహ్మణుల ఆదికృత కోసం విప్రోత్సవం సభ, ర్యాలీ నిర్వహించారు. ముందుగా ద్రోణంరాజు సర్కిల్ నుంచి పీవీ నరసింహారావు కూడలి వరకు శోభాయాత్రగా వెళ్లి అక్కడ పీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా విప్రోత్సవ కమిటీ కన్వీనర్ పీవీ నారాయణ, వివిధ బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన బ్రాహ్మణులు జనాభాలో 10 శాతం మంది ఉన్నారన్నారు. తాము ఏ పార్టీకి అనుకూలం కాదని, వ్యతిరేకం కూడా కాదన్నారు. గత కొన్నేళ్లుగా బ్రాహ్మణులకు టికెట్లు ఇవ్వలేదని, ఈసారి టికెట్ ఇవ్వని పార్టీని ఓడిస్తామని చెప్పారు.